



జములమ్మ దర్శనానికి కిక్కిరిసిన భక్తులు

పూర్వ వైభవం

ఇందిరమ్మ ఇళ్లతో... గృహ నిర్మాణ శాఖకు కొత్త కళ

- పదేళ్లుగా డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల పథకంతో నిర్వీర్యమైన శాఖ
- ఉద్యోగులు, సిబ్బంది నియామకాలతో కార్యాలయాల్లో సందడి
- కొందరు సొంత శాఖకు తిరిగొస్తున్న అధికారులు
- కొనసాగుతున్న ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక
- నియోజకవర్గానికి 3,500 ఇళ్ల నిర్మాణంతో బిజీబిజీగా శాఖ పనితీరు
- త్వరలోనే ఏఈలు, వర్క్ ఇన్‌స్పెక్టర్, కంప్యూటర్ ఆపరేటర్ల పోస్టుల భర్తీ

పదేళ్లుగా ఉలుకూ పలుకూ లేకుండా ఉన్న ఆ శాఖ కొత్త కళ సంతరించుకుంటోంది. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో ఇందిరమ్మ ఇళ్ల పథకం తీసుకువచ్చిన నేపథ్యంలో ఆ శాఖకు పూర్వ వైభవం వచ్చినట్లయింది. ఆరు గ్యారెంటీలలో ఈ పథకం ఒకటిగా ఉండటంతో ప్రాధాన్యం పెరిగింది. గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో లబ్ధిదారుల భాగస్వామ్యం లేకుండా టుబీహెచ్‌కే పథకం నడవగా, ఇప్పుడు ఇందిరమ్మ ఇళ్ల పథకంలో లబ్ధిదారుడే నిర్మాణం చేపట్టుకోవాల్సి ఉంది. గృహ నిర్మాణ శాఖ ఈ పథకాన్ని పర్యవేక్షించనున్నది. ఫలితంగా ఆ శాఖలో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేసే ప్రక్రియ కూడా మొదలెట్టారు. ఇన్నాళ్లు కార్యాలయం వైపు కన్నెత్తి చూడని వారు కూడా నెమ్మదిగా రావడం, లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ సాగుతుండటంతో అన్ని జిల్లాల కార్యాలయాల్లో సందడి నెలకొంటుండటం గమనార్హం.

• సిబ్బంది వస్తున్నారు



ఇందిరమ్మ ఇళ్ల పథకంతో మళ్లీ గృహ నిర్మాణ శాఖకు కొత్త కళ వస్తున్నది. డిప్యూటేషన్‌పై వెళ్లిన వారిలో కొందరు తిరిగి వస్తున్నారు. పథకం ప్రారంభం అయ్యే నాటికి ఏఈలు, కంప్యూటర్ ఆపరేటర్ల నియామకం జరగనుంది. లబ్ధిదారుల ఎంపిక సాగుతున్నది. నాలుగు విడతల్లో నిర్మాణం చేసుకున్న లబ్ధిదారులకు బిల్లులు చెల్లిస్తారు.

- వైద్యం భాస్కర్, పీడీ, గృహనిర్మాణ శాఖ



భూత్పూర్ మండలం భట్టుపల్లిలో ఇందిరమ్మ గృహ లబ్ధిదారుల ఎంపిక కోసం సర్వే నిర్వహిస్తున్న అధికారులు

మహబూబ్‌నగర్, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): లబ్ధిదారుల ఎంపిక జాబి తాలు.. ఇళ్ల నిర్మాణాల ఫొటోలు.. బిల్లుల విడుదల.. వాటి కోసం పైరవీలు.. ఇలా ఎంతో బిజీ బిజీగా ఉండే గృహ నిర్మాణ శాఖ దశాబ్దకాలంగా నిర్వీర్యమైంది.. బీఆర్ ఎస్ ప్రభుత్వం డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల పథకం తీసుకురావడం.. కాంట్రాక్టర్‌లే ఇళ్ల నిర్మాణం చేపట్టడం.. వారికే నేరుగా బిల్లులు చెల్లించడం.. పనుల పర్యవేక్షణ బాధ్యతలను పంచాయతీరాజ్ శాఖ చూసుకోవడంతో గృహ నిర్మాణ శాఖ ప్రమేయం నామమాత్రమైంది. దీంతో అప్పటిదాకా అక్కడ పనిచేస్తున్న అధికారులు, సిబ్బంది డిప్యూటేషన్ పేరిట ఇతర శాఖలకు బదిలీ చేయడం.. క్రమంగా గృహ నిర్మాణ శాఖ కార్యకలాపాలు నిలిచిపోవడంతో మరిచిపోయారు.

ఈ నేపథ్యంలో రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని మళ్లీ తెరపైకి తీసుకువచ్చింది. కాంగ్రెస్ ఇచ్చిన ఆరు గ్యారెంటీలలో ఇందిరమ్మ ఇళ్ల పథకం ఒకటి కావడంతో ప్రాధాన్యత పెరిగింది. లబ్ధిదారుల భాగస్వామ్యం లేకుండా టూబీహెచ్‌కే పథకం నడవగా, ఇప్పుడు ఇందిరమ్మ ఇళ్ల పథకంలో లబ్ధిదారుడే నిర్మాణం చేపట్టుకోవాల్సి ఉంది. గృహ నిర్మాణ శాఖనే పథకాన్ని పర్యవేక్షించనుండటంతో మళ్లీ పూర్వ వైభవం సంతరించుకున్నది. కార్యాలయం వైపు కన్నెత్తి చూడని వాళ్లు నెమ్మదిగా కార్యాలయాలకు రావడం, లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ సాగుతుండటంతో అన్ని జిల్లాలలోని కార్యాలయాలలో సందడి పెరుగుతున్నది. మహబూబ్‌నగర్‌లోని కలెక్టరేట్‌లో రెండు చిన్నగదులతో ఉన్న కార్యాలయం మార్పు చెంది మంగళవారం నుంచి పెద్దహాలు ఉన్న కార్యాలయంగా మారింది. ఈఈ తప్పా మిగతా అధికారులు లేని

- మిగతా 6లో..



జములమ్మ దర్శనానికి పోటెత్తిన భక్తులు

భక్తజన సంద్రం

- జములమ్మను దర్శించుకున్న లక్ష మందికి పైగా భక్తులు
- పుట్టింటి నుంచి వచ్చాక మొదటి మంగళవారం కావడంతో..
- దేవాలయ ఆవరణలో భక్తుల నిలువు దోపిడీ
- తాగునీరు, మరుగుదొడ్లు లేక ఇబ్బందులు పడ్డ భక్తులు

గద్వాల, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): జములమ్మ క్షేత్రం భక్తజనంతో కిక్కిరిసిపోయింది. ఎటు చూసినా కనుచూపు మేరలో భక్తులే.. కనిపిస్తున్నారు. అమ్మవారు పుట్టింటి నుంచి వచ్చిన తర్వాత మొదటి మంగళవారం కావడంతో పెద్ద ఎత్తున భక్తులు క్యూ కట్టారు. తెల్లవారుజామున ఐదు గంటల నుంచే జనం రద్దీ పెరిగింది. జమ్ములమ్మ తల్లి కరుణించవమ్మా అంటూ.. భక్తిభావంతో ఊగిపోయారు. మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాల నుంచేకాక రాయలసీమ, జిల్లా నలుమూల నుంచి పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చారు. బైనోళ్ల, కుర్వడోళ్ల చప్పుళ్ల.. శివసత్తుల పూనకాలతో జమ్ములమ్మ తల్లీ దీవనలు ఇవ్వంటూ అమ్మవారిని కొలిచారు. సాయంత్రం వరకు లక్ష మందికి పైగా భక్తులు అమ్మవారిని దర్శించుకొన్నారని ఆలయ చైర్మన్ వెంకట్రాములు, ఈవో పురేందర్‌కుమార్ తెలిపారు.



దాసంగం పెడుతున్న మహిళలు



అలంకరణలో జములమ్మ అమ్మవారు

వసతులు లేక తిప్పలు

పెద్ద ఎత్తున హాజరైన భక్తులకు సరైన ఏర్పాట్లు చేయలేక పాలకవర్గం, అధికారులు చేతులెత్తేశారు. అరకొరగా ఉన్న మరుగుదొడ్లతో భక్తులు ఆరుబయటకు పోవాల్సిన పరిస్థితి వచ్చింది. తాగునీరులేక దప్పిక తీర్చుకోవడానికి చిరు హోటళ్లను ఆశ్రయించాల్సి వచ్చింది. ఇదిలా ఉంటే ట్రాఫిక్ సమస్య భక్తులకు మరింత చికాకు తెప్పించింది. గంటల తరపబడి వాహనాలలో వేచి ఉండాల్సి వచ్చింది.

భక్తుల నిలువు దోపిడీ

టెండర్‌దారుడు టెంకాయ ధర అమాంతం పెంచేశాడు. ఒకటి రూ.30 విక్రయించాల్సి ఉండగా రూ.50 అమ్ముతున్నారు. రెండు టెంకాయలకు రూ.వంద చెల్లించి, సర్వ దర్శనానికి ఆలయంలోకి వెళ్తే.. కిక్కిరిసిన జనం చూసి రూ.వంద టికెట్ ధర పెట్టి దర్శనం చేసుకోవాల్సి వస్తుంది. బయటకు రాగానే టెంకాయలు కొట్టేవారికి, కొద్దిగా ముందుకు రాగానే బొట్టుపెట్టి నోటు కొట్టు అంటున్నారు. ఈ విషయంపై ఈవోను వివరణ కోరగా.. జాతరలో అధిక ధరకు విక్రయిస్తారు. ఏమి చేయలేం. టెంకాయలు కొట్టేవారిని నిలువరించలేకపోతున్నామని చెప్పడం కొసమెరుపు.

చెట్టుకు ఆకులు కొమ్మకు పువ్వులు అందం

నేనిలా.. నువ్వలా... అంటూ ఓ చెట్టు ఆకులతో కళకళలాడుతుండగా.. మరో చెట్టు కొమ్మలకు పూసిన పువ్వులు చూపరులను ఆకట్టుకుంటున్నాయి. ఈ చెట్లు వనపర్తి జిల్లా గోపాల్‌పేట మండల కేంద్రంలోని లక్ష్మీ చెన్నకేశవ స్వామి ఆలయ ప్రాంగణంలో కనిపించాయి. ఈ దృశ్యాన్ని 'ఆంధ్యజ్యోతి' తన కెమెరాలో మంగళవారం బంధించింది.

- ఆంధ్రజ్యోతి స్టాఫ్ ఫొటోగ్రాఫర్, వనపర్తి జిల్లా



'ఉపాధి' అవినీతికి అడ్డుకట్ట పడేనా?

- సామాజిక తనిఖీలకే పరిమితం
- రికవరీకి వెనకడుగు వేస్తున్న అధికారులు
- ఉమ్మడి జిల్లాలో రూ.లక్షల్లో అవినీతి

నాగర్‌కర్నూల్, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పథకంలో మాన్యువల్ పద్ధతి ద్వారా జరిగిన చెల్లింపుల్లో రూ.లక్షల అవినీతి జరిగింది. ఉమ్మడి జిల్లాలో 2023-24 సంవత్సరంలో చేపట్టిన సోషల్ ఆడిట్‌లో ఈ విషయం బయటపడింది. అధికారుల ఉదాసీనత కారణంగా సొమ్ము రికవరీ కావడం లేదు. ఉమ్మడి జిల్లాలో నాగర్‌కర్నూల్, వనపర్తి, మహబూబ్‌నగర్, నారాయణపేట, గద్వాల జిల్లాలు ఉండగా అంతటా ఈ ప్రహసనం కొనసాగింది. సామాజిక తనిఖీల పేరిట గ్రామాల్లో విచారణ చేస్తున్నప్పటికీ రికవరీని ఏమాత్రం పట్టించుకోకపోవడంపై డీఆర్‌డీఏ అధికారులపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. నాగర్‌కర్నూల్ జిల్లాలో 1,81,586 జాబ్‌కార్డులు ఉండగా, వారికి 32,42,427పని దినాలను కల్పించారు. ఉపాధి హామీ పథకంలో భాగంగా 3,623 పనులు చేపట్టారు. సామాజిక తనిఖీలో రూ. 9,31,885 గోల్‌మాల్ అయ్యాయని నిర్ధారించినా రికవరీకి మాత్రం అధికారులు సాహసించడం లేదు. కేవలం షోకాజ్ నోటీసులు జారీ చేసి వదిలేస్తున్నారు. నారాయణపేట జిల్లాలో కూడా ఇదే పరిస్థితి నెలకొంది. జిల్లాలో దాదాపు రూ.16లక్షల అవినీతి చోటు చేసుకున్నట్లు సామాజిక తనిఖీలో తేలిన అధికారికమైన ఒత్తిళ్లతో ఆఫీసర్లు రికవరీ చేయడానికి సాహసించడం లేదు. వనపర్తిలో దాదాపు రూ.8లక్షల అవినీతి జరిగినా పట్టించు కునే నాథుడే కరువయ్యాడు. మ్యాన్యువల్ విధానం ద్వారా ఉపాధి హామీ డబ్బులు చెల్లించే ప్రక్రియ గతేడాది వరకు కొనసాగడం అక్రమార్కులకు వరంగా మారింది. బోగస్ మస్టర్ రూల్స్ తీసుకుని అందిన కాడికి దోచుకున్నారు. ఇందులో అధికారుల ప్రమేయం కూడా ఉంది.



తాడూరులో ఉపాధి పనులు చేస్తున్న కూలీలు (ఫైల్)

కేసులు నిర్వీర్యం

ఉపాధి హామీ పథకంలో అక్రమాలు చోటు చేసుకున్నప్పుడల్లా క్రిమినల్ కేసులు నమోదు చేస్తున్నామని అధికారులు చెబుతున్నారు. కానీ నామమాత్రంగా పోలీసులకు ఫిర్యాదు చేసి ఆ తర్వాత పట్టించుకోవడం లేదు. లింగాల మండలంలో ఉపాధి హామీ పథకంలో అక్రమాలు జరిగాయని సిబ్బందిపై కేసులు నమోదు చేసినా ఇప్పటి వరకు రికవరీ చేయకపోవడం గమనార్హం. నాగర్‌కర్నూల్, తాడూరుతోపాటు మరో పది మండలాల్లో రెగ్యులర్‌గా ఉపాధి హామీలో అక్రమాలు జరుగుతున్న అధికారులు నోరు మెదపకపోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

నేడు పున్నమి వేడుకలు

- జములమ్మ ఆలయంలో ఏర్పాట్లు పూర్తి
- తెల్లవారుజామున 108 కలశాలతో ఊరేగింపు
- కృష్ణానది జలంతో అమ్మవారికి అభిషేకం

7

మన్యంకొండ.. జనం నిండా..

- నేడు గరుడవాహన సేవ,(తేరు)రథోత్సవం
- తరలివస్తున్న భక్తులు



6

ఎన్నికల నిర్వహణకు సిద్ధం కావాలి

- కమిషన్ ఆదేశాలను తప్పక పాటించాలి
- అధికారులకు దిశానిర్దేశం చేసిన జోగుళాంబ గద్వాల కలెక్టర్ బదావత్ సంతోష్

6



లబ్ధిదారులకు చెక్కులను అందజేస్తున్న ఎమ్మెల్యే మేఘారెడ్డి

అభివృద్ధిపై చర్చకు మాజీ మంత్రి సిద్ధమా?

- వనపర్తి ఎమ్మెల్యే మేఘారెడ్డి

ఖిల్లాఘణపురం, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి) : వనపర్తి నియోజకవర్గంలో చేసిన అభివృద్ధిపై పబ్లిక్‌గా చర్చకు మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి సిద్ధమా? అని ఎమ్మెల్యే మేఘారెడ్డి సవాల్ విసిరారు. పదేళ్లలో మాజీ మంత్రి చేయని పనులను 14 నెలల్లో చేశామని ఎమ్మెల్యే తెలిపారు. వనపర్తి జిల్లా ఖిల్లాఘణపురం మండలంలోని మానాజీపేట, మల్కాపూర్, షాపూర్, పర్వతాపూర్, మామిడిమాడ, సల్కెలాపూర్, అప్పారెడ్డిపల్లి, మల్కిమియాన్‌పల్లి, అల్లమాయపల్లి, తిరుమలాయపల్లిలో సీసీ రోడ్ల నిర్మాణం, డ్రైనేజీ కాలువల నిర్మాణానికి మంగళవారం ఎమ్మెల్యే భూమి పూజ చేసి పనులు ప్రారంభించారు. మండల పరిషత్ సమావేశ మందిరంలో 34 మం దికి కల్యాణలక్ష్మి, 35 మందికి సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను అందజేశారు. మోడల్ ఇందిరమ్మ ఇల్లును ఎమ్మెల్యే పరిశీలించి నాణ్యత ప్రమాణాలపై సూచనలు చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ... నియోజకవర్గంలో ఎస్సీ ఆవాసా ప్రాంతాల్లో రూ.10 కోట్లతో సీసీ రోడ్లు, డ్రైనేజీ నిర్మాణ పనులు చేపడుతున్నట్లు తెలిపారు.

గద్వాల చేనేత బ్రాండ్ నిలబెట్టాలి

- ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి

గద్వాల టౌన్, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి) : గద్వాల చేనేత బ్రాండ్‌ను నిలిపేలా కార్మికులు తమ కళానైపుణ్యానికి పదును పెట్టాలని ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి సూచించారు. ప్రభుత్వం పరంగా కార్మికులకు అన్నిరకాల ప్రయోజనాలు అందించేందుకు తనవంతు బాధ్యతగా కృషి చేస్తానన్నారు. మంగళవారం పట్టణంలోని పాండురంగ శివాలయం వద్ద గల జిహ్వేశ్వర కల్యాణ మండపంలో చేనేత కార్మికుల కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న చేనేత పొదుపు నిధి త్రిఫ్ట్ ఫండ్ పథకంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. చేనేత కార్మికులు ప్రతీనెల కొంత మొత్తాన్ని పొదుపు చేయడం ద్వారా ఆర్థిక భద్రతకు బాటలు వేసుకోవాలన్నారు. ఈ విషయంలో కలెక్టర్‌తో కలిసి బ్యాంకర్లతో చర్చించి మహిళా కార్మికులకు రుణ సహాయం అందించేందుకు కృషి చేస్తానని ఎమ్మెల్యే తెలిపారు. మారుతున్న కాలనానికి అనుగుణంగా ఆధునిక టెక్నాలజీని అందిపుచ్చుకోవాలన్నారు. చేనేత జౌళిశాఖ డెవలప్‌మెంట్ అధికారి సుధారాణి పొదుపు నిధి త్రిఫ్ట్ ఫండ్ పథకానికి సంబంధించిన వివరాలను కార్మికులకు తెలిపారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి



రిషి విద్యార్థుల జయభేరి

మహబూబ్‌నగర్ విద్యావిభాగం, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి) : నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ ఆధ్వర్యంలో జనవరిలో నిర్వహించిన జేఈఈ మెయిన్స్ మొదటి సెషన్ ఫలితాలు మంగళవారం విడుదల అయ్యాయి. ఈ ఫలితాల్లో రిషి జూనియర్ కళాశాల, రిషి ఐఐటీ నీట్ అకాడమీ విద్యార్థులు జయభేరి మోగించారు. కళాశాల విద్యార్థులు సాయిసుజన్ రెడ్డి 98.40, సాయి అక్షయ 97.80, తరుణ్ సాయి 96.75, సాహితీ రెడ్డి 95.77, జోయా 95.09, ప్రణీత్‌కుమార్‌రెడ్డి 94.96, స్వర్ణకుమారి 93.64, ఇస్రార్ 92.09, రోహిత్ 91.61, ఈశ్వర్ 91.61, మనోజ్ఞ 91.20, నివేదిక 91.20 పర్సంటైల్ సాధించారు. ఈ సందర్భంగా విద్యార్థులను కళాశాల ముఖ్య సలహాదారు వెంకటయ్య, చైర్మన్ చంద్రకళ వెంకటయ్య, డీన్ లక్ష్మారెడ్డి, భూపాల్‌రెడ్డి అభినందించారు. అంతకు ముందు విద్యార్థులను కళాశాల యాజమాన్యం, ప్రిన్సిపాల్, అధ్యాపకులు అభినందించారు.


సాయిసుజన్ రెడ్డి


సాయి అక్షయ


తరుణ్ సాయి


సాయితేరెడ్డి

జేఈఈ మెయిన్స్‌లో వాగ్దేవి ప్రభంజనం


విద్యార్థులను అభినందిస్తున్న కరస్పాండెంట్ విజేత వెంకట్‌రెడ్డి తదితరులు

మహబూబ్‌నగర్ విద్యావిభాగం, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి) : జేఈఈ మెయిన్స్ మొదటి సెషన్ ఫలితాలు మంగళవారం విడుదలయ్యాయి. ఈ ఫలితాల్లో జిల్లా కేంద్రంలోని వాగ్దేవి జూనియర్ కళాశాల విద్యార్థులు ప్రభంజనం సృష్టించారు. రేవంత్‌రెడ్డి 97.27 పర్సంటైల్, నవనీత్‌గౌడ్ 90.00 పర్సంటైల్ సాధించారు. అదేవిధంగా నవీన్, అశ్విని, రాంచరణ్, జునేత్, ఓంకార్, అర్తీ, సురేష్ నాయక్, కస్తూరి, శివ, ప్రభాస్, గోవింద్ మంచి పర్సంటైల్ సాధించడంతో కళాశాల కరస్పాండెంట్ విజేత వెంకట్‌రెడ్డి, ఐఐటీ, నీట్ అకాడమీ ఇన్‌చార్జి పావనిరెడ్డి, ప్రిన్సిపాల్ గీతాదేవి, అధ్యాపకులు రాఘవేందర్‌రావు, షాకీర్, యాకుబ్, సందీప్, గోవిందరాజులు, రామ్‌రెడ్డి, మహేష్ విద్యార్థులను అభినందించారు. తమ కళాశాల విద్యార్థులు జాతీయస్థాయిలో మంచి ర్యాంకులు సాధించడం సంతోషంగా ఉందన్నారు.

ప్రతిభ విద్యార్థుల విజయభేరి


కె.కేదారినాథ్


ఎన్.వర్షిత్‌గౌడ్


వాత్సల్య

మహబూబ్‌నగర్ విద్యావిభాగం, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి) : జేఈఈ మెయిన్స్ మొదటి విడత ఫలితాల్లో జిల్లా కేంద్రంలోని ప్రతిభ జూనియర్ కళాశాల విద్యార్థులు విజయభేరి మోగించారు. ఈ ఫలితాల్లో కె.కేదారినాథ్ 98.28 పర్సంటైల్, ఎన్.వర్షిత్‌గౌడ్ 98.15 పర్సంటైల్, జీఎల్ఎస్ఎస్ వాత్సల్య 98.06, యం.విశాల్ 97.12, నాగకౌశిక 96.95, సి.జతిన్ 96.03, కె.భరత్ 96.16, ఎం.భానుప్రదీప్ 95.43, పి.సాయిజస్వంత్‌రెడ్డి 95.39, ఎ.శశిశంకర్ 94.3, వి.సాకేత్ 94.19, అంజనీ చరస్య రాఘవ్ 94.01, ఎ.నరేష్ 93.20, జి.వైష్ణవి 93.84, ఎన్.అభిరామ్ 92.99, కె.మల్లేష్ 92.42, కె.మానస 92.1 పర్సంటైల్ సాధించి ఉమ్మడి పాలమూరు జిల్లాలో ప్రతిభ కళాశాలను ప్రథమ స్థానంలో నిలిపారు. ఈ ఫలితాల్లో 90 పర్సంటైల్ పైన 42 మంది విద్యార్థులు, 90 నుంచి 80 మధ్య పర్సంటైల్ సాధించిన విద్యార్థులు 51 మంది ఉన్నట్లు తెలిపారు. కళాశాలకు చెందిన 219 మంది విద్యార్థులు జేఈఈ అడ్వాన్స్‌డ్‌కు అర్హత సాధించినట్లు తెలిపారు. కళాశాల డైరెక్టర్స్ కె.మంజులా దేవి, వి.లక్ష్మారెడ్డి, కె.విష్ణువర్ధన్‌రెడ్డి, కె.జనార్దన్‌రెడ్డి, జి.వెంకటేశ్వర్‌రెడ్డి విద్యార్థులను అభినందించారు. ప్రిన్సిపాల్ వెంకట్రామయ్య, ఎన్.వెంకట్‌రెడ్డి, ఎం.కృష్ణయ్య, అధ్యాపకులు కృషి ఉందన్నారు.

పూర్వ వైభవం

(5వపేజీ తరువాయి)

కార్యాలయానికి ఇటీవలే మేనేజర్, డీఈ పోస్టులను ఇచ్చారు. ఉమ్మడి జిల్లాలోని అన్ని జిల్లాల్లో గృహ నిర్మాణ శాఖ నుంచి ఇతర శాఖలకు డిప్యూటేషన్‌పై వెళ్లిన వారిలో కొందరు ఉద్యోగ విరమణ చేయగా ఉన్నవాళ్లలో ఆసక్తి ఉన్న వారు మళ్లీ సొంతగూటికి తిరిగి వస్తున్నారు.

● నియోజకవర్గాలలో లబ్ధిదారుల ఎంపికపై కసరత్తు

ప్రభుత్వం ప్రతి ఏటా ప్రతీ నియోజకవర్గానికి 3500 ఇళ్లను మంజూరు చేసింది. ఇందులో భాగంగానే మొదటి విడతలో ఇప్పటికే లబ్ధిదారుల ఎంపిక దాదాపుగా పూర్తికాగా ఫైనల్ జాబితాను సిద్ధం చేయాల్సి ఉంది. ఇందిరమ్మ ఇళ్లకు అర్హులై ఇల్లు కట్టుకోవడానికి సొంత స్థలం ఉన్న వారిని లబ్ధిదారులుగా ఎంపిక చేస్తున్నారు. ఈ స్థలాన్ని గ్రామ కార్యదర్శి ద్వారా లబ్ధిదారులతో ఫొటోలు తీయించి జియో ట్యాగింగ్ చేయనున్నారు. ముందుగా చూపించిన స్థలంలోనే ఇంటి నిర్మాణం చేయాల్సి ఉంటుంది. తరువాత ఎంపీడీవో పరిశీలించి అట్టి జాబితాను కలెక్టర్‌కు పంపిస్తారు. ఆ తరువాత అర్హుల జాబితాను విడుదల చేయనున్నారు. గతంలో ఇందిరమ్మ ఇళ్లకు ఇచ్చిన తరహాలోనే నాలుగు విడతల్లో స్టేజీ వారిగా నిర్మాణాలు జరుగుతున్నపుడు బిల్లులు మంజూరు చేస్తారు. ఇదంతా గృహ నిర్మాణ శాఖ పర్యవేక్షిస్తుంది. అందుకే మళ్లీ ఈ శాఖకు పూర్వవైభవం రానుండటంతో అధికారులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం ఏఈ, వర్క్ఇన్‌స్పెక్టర్, కంప్యూటర్ ఆపరేటర్ల నియామకం చేయాల్సి ఉంది. ఇదివరకు మండలానికి ఒక ఏఈ ఉండేవారు. మరో 15 రోజుల్లో పథకం గ్రౌండింగ్ అయ్యే అవకాశం ఉండటంతో అప్పటివరకు సిబ్బంది నియామకం చేయాల్సి ఉంది. ప్రభుత్వం కూడా ఉన్నవాళ్లను సర్దుబాటు చేసిన తరువాత అవసరమైన స్టాఫ్‌ను భర్తీ చేయనుంది. ముందుగా రెండు, మూడు మండలాలకు ఏఈని నియమించే అవకాశం ఉంది. గద్వాల, నారాయణపేట, వనపర్తిలోనే ఒక్కో డీఈ మాత్రమే ఉన్నారు.

● ఇందిరమ్మ ఇళ్లకు ఉచిత ఇసుక

ఇందిరమ్మ ఇళ్లకు ప్రభుత్వం ఉచితంగా ఇసుక సరఫరా చేయాలని నిర్ణయించింది. ఓవైపు అక్రమ ఇసుక దందా సాగుతుండగా ఇందిరమ్మ ఇళ్లకు ఇసుక సరఫరా కష్టసాధ్యం కానుంది. దీంతో ప్రభుత్వం ఈ విషయంపై సీరియస్‌గా దృష్టి సారించింది. లబ్ధిదారులు బుక్ చేసుకున్న 48 గంటల్లో ఇసుక చేరేలా చర్యలు తీసుకోవాలని, అక్రమ రవాణా కట్టడి బాధ్యతలను జిల్లాల కలెక్టర్, ఎస్పీలకు అప్పగించడంతో పోలీస్‌శాఖ అప్రమత్తమైంది.

ఇసుక అక్రమ రవాణాపై కఠిన చర్యలు తీసుకుంటామని మహబూబ్‌నగర్ జిల్లా ఎస్పీ జానకి ఒక ప్రకటనలో హెచ్చరికలు జారీ చేశారు. రాజకీయ నాయకులు సాగిస్తున్న ఈ దందాలో పోలీస్ శాఖనే అక్రమ ఇసుక రవాణాను ప్రోత్సహిస్తున్న తరుణంలో ఇప్పుడు అకస్మాత్తుగా ఇసుక అక్రమ రవాణా కట్టడి ఏమేర సాధ్యమవుతుందో చూడాలి.

ఎల్లమ్మ తల్లీ.. కరుణించవమ్మా...

- బోనాలు, పూనకాల మధ్య ప్రారంభమైన ఉత్సవాలు

నారాయణపేటరూరల్, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): చంకలో కోళ్లు, తలపై బోనాలు, చేతిలో కల్లు తదితర వస్తువులతో ఎల్లమ్మ తల్లీ కరుణించవమ్మా... అంటూ భక్తుల శరణు ఘోష, పూనకాలతో ఆ ప్రాంతంలో భక్తి పారవశ్యం నిండిపోయింది. నారాయణపేట మండలం లింగంపల్లి ఎల్లమ్మ దేవత జాతర భక్తజన సందోహం మధ్య మొదటి రోజైన మంగళవారం ఘనంగా ప్రారంభమైంది. ఎల్లమ్మ తల్లీ కరుణించవమ్మా అంటూ శరణు ఘోష మధ్య వేలాదిగా భక్తులు ఎల్లమ్మదేవత దర్శనానికి బారులు తీరారు. జాతరలో భక్తిశ్రద్ధలతో భక్తులు తలలపై వేప మండలాలతో బోనం కుండలను తెస్తూ సంకలో కోళ్లు, మహిళల పూనకాలు, పసుపు, బండారు చల్లుకుంటూ దేవతకు మొక్కులను చెల్లించుకున్నారు. ఉత్సవాల్లో ప్రధాన ఘట్టమైన పెద్ద బోనంకుండ ముందు అమ్మవారి భక్తురాలైన సాయమ్మ నోటికి తాళంవేసే గగుర్పొడిచే సన్నివేశం (ప్రధాన ఘట్టం) తిలకించేందుకు భక్తులు ఎగబడ్డారు. ఎల్లమ్మ దేవత వేడుకలను తిలకించేందుకు జిల్లా నలుమూలల నుంచే కాక కర్ణాటక, మహారాష్ట్ర నుంచి పెద్దసంఖ్యలో భక్తులు తరలివచ్చారు. నాలుగు వారాల పాటు సాగే ఈ ఉత్సవాల్లో రెండు వారాలపాటు అమ్మవారి అలంకరణను భక్తుల సందర్శనార్థం ఏర్పాటు చేస్తారు.

పూజా కార్యక్రమాలకు ఎనలేని విశిష్టత...

ఉత్సవాల్లో ప్రధాన ఘట్టమైన పెద్దబోనం కుండ, అమ్మవారి భక్తురాలైన సాయమ్మ నోటికి వేసేతాళం పూజా కార్యక్రమాలు ఎంతో విశిష్టతను సంతరించుకున్నాయి. మధ్యాహ్నం 12 గంటల నుంచి ఒంటిగంట వరకు జరిగిన పెద్దబోనం కుండ ఉత్సవాల్లో పాల్గొన్న భక్తులు అమ్మవారిని కొలిచి మొక్కుబడులు చెల్లించుకున్నారు. అమ్మవారి భక్తురాలైన సాయమ్మ ముఖానికి పసుపు, కుంకుమలతో బొట్టుపెట్టి గొంగడిమధ్య ఉన్న ఆమెకు వేపమండలాలు చుట్టారు. మెడలో పూలమాల, గవ్వల దండను వేయడంతో పూనకం మధ్యనున్న భక్తురాలు సాయమ్మ నోటికి బైండ్లవారు ఒక చెంపనుంచి మరో చెంపకు రాగికడ్డీని గుచ్చి ఆ తర్వాత తాళం వేశారు. దాంతో దేవాలయ పరిసరాలు ఒక్కసారిగా భక్తులు ఎల్లమ్మ దేవతకు చప్పట్లతో జేజేలు పలికారు. దేవాలయం ముందు నుంచి పెద్దబోనం కుండ ముందు సాయమ్మను ప్రదక్షిణలు చేయించి దేవాలయంలో ఒక పక్కనున్న పరశురాం విగ్రహం వరకు తీసుకెళ్లి మూడుసార్లు ప్రదక్షిణలు చేయించారు. దేవాలయ వంశ పారంపర్య ధర్మకర్త పూజారి పరశురాం పెద్ద బోనంకుండ మోయగా బోనంకుండ వెంబడి పలువురు మహిళలు పూనకంతో ఊగిపోతూ ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేశారు.


అమ్మవారిని దర్శించుకున్న ఎమ్మెల్యే పర్ణికారెడ్డి

ఈ జాతరలో అన్నీ ప్రాముఖ్యత కల్గినవే...

ఈ ఉత్సవాల్లో ప్రధాన ఘట్టమైన పెద్ద బోనంకుండ, అమ్మవారి భక్తురాలైన సాయమ్మ నోటికి వేసే తాళానికి ప్రాధాన్యత సంతరించుకుంది. అమ్మవారికి బోనంకుండ, కోడి, వేప మండలాలు, పచ్చిపులుసు, పెరుగన్నం, వంకాయ కూరతో భక్తులు నైవేద్యాలను వండి సమర్పించారు. ఉత్సవాలకు పరిసర ప్రాంతాల జనాలు పెద్దసంఖ్యలో రావడంతో గ్రామ శివారులోనే వాహనాలను నిలిపి రాకపోకలకు అంతరాయం కల్గకుండా పోలీసులు తగిన చర్యలు తీసుకున్నారు.

పూజల్లో పాల్గొన్న పేట ఎమ్మెల్యే

లింగంపల్లి ఎల్లమ్మ జాతర ఉత్సవాల్లో భాగంగా పేట ఎమ్మెల్యే డాక్టర్ చిట్టెం పర్ణికారెడ్డి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు ఎమ్మెల్యే చేతుల మీదుగా అమ్మవారికి హారతి తదితర పూజలు నిర్వహింపజేశారు. ఎమ్మెల్యే వెంట మార్కెట్ చైర్మన్ సదాశివారెడ్డి ఉన్నారు.

బందోబస్తును పరిశీలించిన డీఎస్పీ లింగయ్య

లింగంపల్లి జాతరోత్సవాల్లో భాగంగా భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పేట రూరల్ పోలీసుల ఆధ్వర్యంలో ప్రత్యేక బందోబస్తును నిర్వహించారు. వాహనాలను గ్రామ శివారులోనే పార్కింగ్ చేసేలా చర్యలు తీసుకున్నారు. బందోబస్తును పేట డీఎస్పీ లింగయ్య పరిశీలించారు. రూరల్ ఎస్ఐ సి.రాముడు పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

మన్యంకొండ.. జనం నిండా..

- తరలివస్తున్న భక్తులు


సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ జానకి


హనుమవాహన సేవ

మహబుబ్‌నగర్ రూరల్, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ తిరుపతిగా పేరుగాంచిన మన్యంకొండ లక్ష్మీ వేంకటేశ్వరస్వామివారి బ్రహ్మోత్సవాలకు భక్తులు తరలివస్తున్నారు. భక్తులు తమ మొక్కులు తీర్చుకునేందుకు ఎద్దులబండ్లపై , ట్రాక్టర్లపై, కాలినడకతో వస్తున్నారు. మన్యంకొండ బ్రహ్మోత్సవాలలో భాగంగా బుధవారం అర్ధరాత్రి రథోత్సవం(తేరు) జరుగనుంది. స్థానిక ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి హాజరు కానున్నారు. ఈ రథోత్సవ కార్యక్రమనికి భారీగా పోలీసు బందోబస్తు, ఫైర్ విభాగం, విద్యుత్ శాఖ, ఇతర శాఖల వారు, స్వచ్ఛంద సంస్థలు, వలంటీర్లు అధిక సంఖ్యలో పాల్గొననున్నారు. స్వామివారి తేరును చూసేందుకు రాష్ట్ర నలుమూలల నుంచి తరలివస్తున్నారు. ఈ బ్రహోత్సవాల్లో భాగంగా మంగళవారం ఆలయంలో లక్ష్మీ వేంకటేశ్వరస్వామివారికి ఆలయ ధర్మకర్త మధుసూదన్ కుమార్, అర్చకులు స్వామివారికి అభిషేకం చేశారు. వేద మంత్రాల నడుమ హనుమ వాహన సేవ నిర్వహించారు.

అనంతరం పల్లకిలో గ్రామోత్సవ కార్యక్రమాలు నిర్వహించారు. స్వామివారి బ్రహ్మోత్సవాలలో భాగంగా ప్రత్యేక విద్యుత్ దీపాలంకారణ కోసం స్వామివారి గోపురాల చుట్టూ, ప్రధాన ఆర్చీ వద్ద భక్తులకు కనువిందు కలిగేల రంగురంగుల విద్యుత్‌దీపాలతో అలంకరించారు. ఉచిత బస్సుకావడంతో మహిళలు తండోప తండాలుగా తరలివస్తున్నారు. భక్తుల సౌకర్యార్థం టీఎస్ఆర్‌టీసీ మహబూబ్‌నగర్‌డిపోతో పాటు పలుడిపోలకు చెందిన మినీ బస్సులను కొండపై వరకు వేళ్లేలా భక్తుల కోసం ఏర్పాటు చేశారు. భక్తులు దాసంగాలను వండి స్వామివారికి సమర్పించేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. రద్దీని దృష్టిలో పెట్టుకొని అన్ని రకాల ఏర్పాట్లను చేశారు. స్వామివారి దర్శనానికి వచ్చిన భక్తులకు నిత్య అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు.

బ్రహ్మోత్సవాలకు పోలీస్ బందోబస్తు

- పోలీసులకు దిశానిర్దేశం చేసిన ఎస్పీ జానకి

మహబూబ్‌నగర్, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి పాలమూరులో ప్రసిద్ధి చెందిన మన్యంకొండ లక్ష్మీ వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలకు పోలీస్‌శాఖ భారీ బందోబస్తును ఏర్పాటు చేస్తోంది. గురువారం బ్రహ్మోత్సవాలలో కీలకమైన రథోత్సవానికి వేలాదిగా భక్తులు తరలిరానున్నందున పోలీస్‌శాఖ అప్రమత్తమైంది. 400 మంది పోలీసులతో భారీ బందోబస్తు ఏర్పాటు చేయనున్నట్లు జిల్లా ఎస్పీ జానకి వెల్లడించారు. మంగళవారం బందోబస్తు పోలీసులతో ఎస్పీ సమావేశమై వారికి నిర్దేశం చేశారు. బ్రహ్మోత్సవాలకు భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చే అవకాశం ఉన్నందున పోలీసులు బందోబస్తులో అప్రమత్తంగా ఉండి భక్తులకు, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని, ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా చూడాలని సూచించారు. భక్తులతో మర్యాదపూర్వకంగా నడుచుకోవాలని, దొంగతనాలు జరగకుండా మఫ్టీలో ఉన్న సిబ్బంది అందరినీ గమనిస్తుండాలని తెలిపారు. జేబుదొంగలు, అనుమానాస్పద వ్యక్తుల కదలికలపై గట్టి నిఘా ఉంచాలని, మఫ్టీలో పోలీసులను మోహరించాలన్నారు. ట్రాఫిక్ సమస్యలు లేకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేశామన్నారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఆలయానికి సమీపంలో ప్రత్యేక పార్కింగ్ కేంద్రాలను ఏర్పాటుచేశామని వెల్లడించారు. మహిళా భక్తుల భద్రతకోసం పోలీసులను ప్రత్యేకంగా నియమిస్తున్నామని వివరించారు.

ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగట్టాలి

» మాజీ ఎమ్మెల్యే గువ్వల బాలరాజు


మాట్లాడుతున్న గువ్వల బాలరాజు

లింగాల, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి) : కాంగ్రెస్ ప్రభుత్వం అవలంభిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను క్షేత్రస్థాయిలో ఎండగట్టాలని బీఆర్ఎస్ నాగర్‌కర్నూల్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే గువ్వల బాలరాజు అన్నారు. మంగళవారం రాయవరం గ్రామంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలతో మండల స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అడ్డగోలు హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చాక వాటిని అమలు చేయకుండా కాలయాపన చేస్తూ ప్రజలను మభ్యపెడుతున్నదని కాంగ్రెస్ ప్రభుత్వంపై ఆరోపించారు. రైతు భరోసా పేరిట రూ.15వేలు ఇస్తామని చెప్పి అధికారంలోకి వచ్చాక ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రభుత్వం వానాకాలం రైతు భరోసా ఎగ్గొట్టిందని దుయ్యబట్టారు. యాసంగి పంటకు ఇప్పటి వరకు రైతు భరోసా చాలా మంది రైతులకు ఇవ్వలేదని అన్నారు. రెండు లక్షల రుణ మాఫీ డబ్బులు చాలా మంది రైతులకు అందలేదని వాపోయారు. ప్రజాస్వామ్యంలో గెలుపోటములు సహజమని, ప్రతిపక్ష పాత్ర పోషిస్తున్న బీఆర్ఎస్ పార్టీ ప్రజల గొంతుకగా పోరాడాలని నాయకులు, కార్యకర్తలకు సూచించారు. బీఆర్ఎస్ కార్యకర్తలకు, నాయకులకు అండగా ఉంటామన, ఎవరూ అధైర్యపడవద్దని భరోసా కల్పించారు. పదేళ్లలో బీఆర్ఎస్ పాలనలో పేదరిక నిర్మూలన కోసం అమలు చేసిన సంక్షేమ, అభివృద్ధి పథకాలను ప్రతి పల్లెల్లో గడపగడపకు తిరుగుతూ వివరించాలని సూచించారు. బీఆర్ఎస్ నాయకులు కేటీ తిరుపతయ్య, సింగిల్ విండో అధ్యక్షుడు హనుమంతురెడ్డి, వెంకట్‌రెడ్డి, కోనేటి తిరుపతయ్య, నాగేశ్వర్‌రావు, శ్రీనివాస్ యాదవ్, సేవ్యా నాయక్, శివయ్య, తిరుపతయ్య, గోబ్రియా, జగపతి, చందు నాయక్, మద్దిలేటి, బాలరాజు, శివకృష్ణ, నరేందర్, శంకర్, శివానంద్, అంజి, బాలకృష్ణ, హతీరాం, వెంకటేష్ పాల్గొన్నారు.

నేటి నుంచి ఏఐసీసీ శిక్షణ తరగతులు

» వేదిక కానున్న కొల్లాపూర్‌లోని సోమశిల

» హాజరుకానున్న పార్టీ ప్రతినిధులు, మంత్రులు, ఎమ్మెల్యేలు


మాట్లాడుతున్న లింగ్యానాయక్, చిత్రంలో హనుమంత్‌నాయక్

కొల్లాపూర్, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి) : కొల్లాపూర్ మండల పరిధిలోని సోమశిల గ్రామంలో బుధవారం నుంచి మూడు రోజులపాటు ఆల్ ఇండియా కాంగ్రెస్ కమిటీ ఆధ్వర్యంలో గిరిజన, చెంచు, ఎరుకలి వర్గాలకు రాజకీయ ఉపాధి శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు ఉమ్మడి జిల్లా ఆదివాసి కమిటీ చైర్మన్ లింగ్యానాయక్, కొల్లాపూర్ జడ్పీటీసీ మాజీ సభ్యుడు హనుమంత్ నాయక్ పేర్కొన్నారు. మంగళవారం కొల్లాపూర్ పట్టణంలోని ఎంజీఎల్‌ఐ అతిథి గృహంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ ఈనెల 12, 13, 14వ తేదీలలో కొల్లాపూర్ మండలం సోమశిల గ్రామంలో నిర్వహించే శిక్షణ తరగతులకు ముఖ్య అతిథిగా ఏఐసీసీ కార్యదర్శి కొప్పుల రాజు, మంత్రి జూపల్లి కృష్ణారావు, ట్రైకార్ చైర్మన్ బెల్లయ్య నాయక్‌లు హాజరవుతారని వారు పేర్కొన్నారు. ఉమ్మడి జిల్లా ఎమ్మెల్యేలు, రాష్ట్రం లోని గిరిజన ఎమ్మెల్యేలు హాజరవుతారని తెలిపారు. మూడు రోజుల పాటు నిర్వహించనున్న శిక్షణ తరగతులను గిరిజనులు, చెంచులు, ఎరుకలి వర్గాల వారు సద్వినియోగ పరుచుకోవాలని కోరారు. రాజకీయ, ఉపాధి రంగాల్లో రాణించేలా ఈ తరగతులు ఎంతగానే దోహదపడతాయని వారు అభిప్రాయపడ్డారు.

వైభవంగా వేంకటేశ్వరస్వామి కల్యాణం

» తరలి వచ్చిన భక్తజనం

పెద్దకొత్తపల్లి, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి) : నాగర్‌కర్నూల్ జిల్లా పెద్దకొత్తపల్లి మండలం దేవుని తిర్మలాపూర్ గ్రామంలో వేంకటేశ్వరస్వామి కల్యాణ మహోత్సవం కమనీయంగా జరిగింది. మంగళవారం మధ్యాహ్నం మంగళవాయిద్యాల నడుమ, వేద పండితుల మంత్రోచ్ఛరణాల మధ్య వైభవోపేతంగా అలివేలుమంగ వేంకటేశ్వరస్వామి కల్యాణ మహోత్సవానికి దేవునితిర్మలాపూర్, పెద్దకొత్తపల్లి, వెన్నచెర్ల, నక్కలపల్లి, పెద్దకార్పాముల, బావాయిపల్లి, తీగలపల్లి, జనుంపల్లి తదితర గ్రామాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు డాక్టర్ పగిడాల శ్రీనివాసులు, మాజీ సర్పంచ్ వి.సత్యం, మాజీ ఉప సర్పంచ్ వి.శ్రీనివాసులు, మాజీ ఎంపీటీసీ సభ్యుడు కే.ప్రతాప్‌రెడ్డి, వివిధ పార్టీల నాయకులు పుట్ట ఆంజనేయులు, బాలస్వామి, గడ్డికోపుల శివుడు, యాదగిరి, సత్యం, డబ్బ ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు. అనంతరం భక్తులకు రాజు, వారకట్ట శేఖర్ అన్నదాన కార్యక్రమం చేశారు. ఆలయ ఆవరణలో గుడిపల్లి నరసింహారెడ్డి, కళాజాత బృందం ప్రదర్శించిన వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు పలువురిని ఆకట్టుకున్నాయి. అర్చకులు శేఖర్‌శర్మ, శేషాచార్యులు, రాఘవేంద్రశర్మ నేతృత్వంలోని స్వామి వారి కల్యాణం జరిపారు.


అలివేలు మంగ వేంకటేశ్వరస్వామి కల్యాణం జరిపిస్తున్న అర్చకులు

ఎన్నికల నిర్వహణకు సిద్ధం కావాలి

» జోగులాంబ గద్వాల కలెక్టర్ బీఎం సంతోష్


మాట్లాడుతున్న కలెక్టర్ బీఎం సంతోష్

గద్వాల న్యూటౌన్, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): రాబోవు ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల నిర్వహణ బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించేందుకు అన్ని విధాలుగా సిద్ధం కావాలని కలెక్టర్ బీఎం సంతోష్ అధికారులకు సూచించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో ఎన్నికల విధులను నిర్వర్తించునున్న రిటర్నింగ్ అధికారులకు ట్రైనర్‌లతో శిక్షణ తరగతులను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కలెక్టర్ హాజరై మాట్లాడారు. గతంలో నిర్వహించిన ఎన్నికల అనుభవాలను దృష్టిలో పెట్టుకొని ఎన్నికల కమిషన్ ఆదేశాలను పాటించాలన్నారు. రిటర్నింగ్ అధికారులు క్రియాశీలక పాత్ర పోషించాల్సి ఉంటుందన్నారు. ఎన్నికల నిబంధనలపై పూర్తి అవగాహక కలిగి, వాటిని ఖచ్చితంగా పాటించాల్సిన అవసరం ఉందన్నారు. ఎన్నికల బ్యాలెట్ పత్రాల ద్వారా జరుగనున్న నేపథ్యంలో నోటిఫికేషన్ జారీ నుంచి నామినేషన్ల స్వీకరణ, పరిశీలన, ఉపసంహరణ, గుర్తుల కేటాయింపు, పోలింగ్, కౌంటింగ్ వరకు ప్రతీ దశలో రిటర్నింగ్ అధికారులు అత్యంత జాగ్రత్తగా, పూర్తిస్థాయిలో బాధ్యతగా వ్యవహరించాలన్నారు. నోటిఫికేషన్ జారీ చేసిన తక్షణమే నామినేషన్ల స్వీకరణ ప్రారంభం కావాలని, అభ్యర్థులు ఎన్ని నామినేషన్లు సమర్పించినా వాటిని పూర్తిగా పరిశీలించి, ఆమోదించినవి, తిరస్కరించినవి, తిరస్కరణకు కారణాలను స్పష్టంగా ప్రకటించాలని సూచించారు. నామినేషన్ దాఖలు చేయడానికి అభ్యర్థితోపాటు ప్రతిపాదకుడు, మరో వ్యక్తి కలిపి గరిష్ఠంగా ముగ్గురికి మాత్రమే రిటర్నింగ్ అధికారి గదిలో ప్రవేశం కల్పించాలన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్లు లక్ష్మీనారాయణ, నర్సింగరావు, డిప్యూటీ సీఈవో నాగేంద్రం, రిటర్నింగ్ అధికారులు ఉన్నారు.

ఇసుక అక్రమ రవాణా చేస్తే కఠిన చర్యలు

» నాగర్‌కర్నూల్ కలెక్టర్ బదావత్ సంతోష్

» ఉప్పునుంతలలో ఇసుక రీచ్‌లను పరిశీలించిన కలెక్టర్, ఎస్పీ


దుందుబీ వాగు వద్ద ఇసుక రీచ్‌ల గురించి రెవెన్యూ అధికారులను అడిగి తెలుసుకుంటున్న కలెక్టర్ బదావత్ సంతోష్, ఎస్పీ గైక్వాడ్ వైభవ్ రఘునాథ్

ఉప్పునుంతల, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి) : ఇసుక అక్రమ తవ్వకాలు జరిపితే కఠిన చర్యలు తీసుకుంటామని నాగర్‌కర్నూల్ కలెక్టర్ బదావత్ సంతోష్ హెచ్చరించారు. మంగళవారం నాగర్‌కర్నూల్ జిల్లా ఉప్పునుంతల మండలంలోని మొల్గర, పెద్దాపూర్ సమీపంలోని దుందుబీ వాగులోని ఇసు రీచ్‌లను ఎస్పీ గైక్వాడ్ వైభవ్ రఘునాథ్‌తో కలిసి కలెక్టర్ పరిశీలించారు. ఇసుక తవ్వకాలకు ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు మాత్రమే అనుమతి ఉంటుందని కలెక్టర్ స్పష్టం చేశారు. ఈ వ్యవస్థను పర్యవేక్షించేందుకు ఇసు రీచ్‌ల వద్ద పోలీస్, రెవెన్యూ అధికారులు విధుల్లో ఉంటారని తెలిపారు. ఇసుక రీచ్ వద్దకు చేరుకునే వినియోగదారులు ముందుగా ఆన్‌లైన్‌లో నమోదు చేసుకున్న కూపన్లను సమర్పించాలన్నారు. అధికారులు పరిశీలించిన తర్వాతే తవ్వకాలకు అనుమతి ఇస్తారన్నారు. ఎన్‌టీటీ నిబంధనలకు విరుద్ధంగా యంత్రాలతో ఇసుక తవ్వకాలు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హెచ్చరించారు. జిల్లాలో ఎక్కడైనా ఇసుక అక్రమ రవాణా జరిగితే ఎంతటి వారైనా ఉపేక్షించేది లేదన్నారు. సాధారణ ప్రజలకు అందుబాటులో ఉండేలా ఇసుకను ఆన్‌లైన్ ద్వారా పొందే విధానాన్ని మరింత మెరుగుపరచాలని అధికారులకు సూచించారు. వారి వెంట అచ్చంపేట డీఎస్పీ శ్రీనివాసులు, సీఐ రవీందర్, స్పెషల్ బ్రాంచ్ సీఐ నర్సింహారావు, క్రైమ్ ఇన్‌స్పెక్టర్ శంకర్, ఎస్ఐ వెంకట్‌రెడ్డి, తహసీల్దార్ ప్రమీల, ఆర్ఐ సుజాత తదితరులు ఉన్నారు.

ఉత్సాహంగా చెన్నకేశవస్వామి తెప్పోత్సవం


లింగంబావిలో తెప్పోత్సవం నిర్వహిస్తున్న అర్చకులు

గద్వాల టౌన్, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి) : గద్వాల కోటలోని భూలక్ష్మీచెన్నకేశవస్వామి బ్రహోత్సవాల్లో భాగంగా మూడవ రోజు మంగళవారం స్వామివారిని గరుడ వాహనంపై ఊరేగించారు. కలెక్టర్ బీఎం సంతోష్ ప్రత్యేక పూజలు నిర్వహించి గరుడ వాహనం ఊరేగింపు ప్రారంభించారు. అనంతరం పట్టణంలోని లింగంబావిలో ఉత్సవ మూర్తులతో తెప్పోత్సవం నిర్వహించారు. పద్మశాలి కులస్తులు, చేనేత జరీ చీరల ఉత్పత్తిదారుల సంఘం ఆధ్వర్యంలో వారం రోజుల పాటు కోట ఆలయంలోనే సిద్ధం చేసిన పట్టు వస్త్రాలను ఎమ్మెల్యే కుమారుడు బండ్ల సాయిసాకేత్‌రెడ్డి స్వామివారికి సమర్పించారు.

నల్లమలలో ఎవరూ అనారోగ్యం బారిన పడొద్దు

» అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ


సర్జికల్ క్యాంపులో వైద్య సిబ్బందితో ఎమ్మెల్యే వంశీకృష్ణ

అచ్చంపేట టౌన్, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): నల్లమలలో ఎవరూ అనార్యోగంతో బాధపడవద్దు, అందరికి ఉచిత వైద్యం అందిస్తామని ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ అన్నారు. సర్జికల్ క్యాంపులో భాగంగా మంగళవారం నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేట ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చే రోగులకు ఆరోగ్య సమస్యలు అడిగి తెలుసుకున్నారు. వైద్యులతో కలిసి రోగులకు సర్జరీలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆరోగ్య సమస్యలతో ఆసుపత్రికి వచ్చిన రోగులలో విజయవంతంగా 150 సర్జరీలు చేశామన్నారు. ఇంత పెద సర్జికల్ క్యాంప్ విజయవంతమైనందుకు సంతోషంగా ఉందన్నారు. చారకొండ మండలానికి చెందిన మహిళకు సర్జరి చేసి ప్రమాదకరంగా ఉన్న కణతి తొలగించారు. కార్యక్రమంలో డీసీహెచ్ రామకృష్ణ, డిప్యూటీ డీఎంహెచ్‌వో తారాసింగ్, సూపరింటెండెంట్ ప్రభు, జనరల్ సర్జన్లు సిబ్బంది పాల్గొన్నారు.

ఏరియా ఆసుపత్రికి బెంచీల వితరణ

సీబీఎం ట్రస్టు చైర్మన్ డాక్టర్ అనురాధ ఆధ్వర్యంలో పట్టణంలోని ఏరియా ఆసుపత్రికి బెంచీలు అందజేశారు. వాటిని ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ ప్రాంతానికి వైద్యం పరంగా అన్ని రకాల మౌలిక వసతులను సమకూర్చుతున్నామన్నారు.

స్పోర్ట్స్ బాక్స్

వాలీబాల్ రాష్ట్ర జట్టుకు ఎంపికైన గీత


ఎస్.గీత

మహబూబ్‌నగర్ స్పోర్ట్స్, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి) : మహబూబ్ నగర్ పట్టణంలోని మార్కెట్ రోడ్డు ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో పీఈటీగా విధులు నిర్వర్తిస్తున్న ఎస్.గీత వాలీబాల్ రాష్ట్ర జట్టుకు ఎంపిక య్యారు. తమిళనాడు రాష్ట్రంలోని చెన్నైలో బుధ వారం నుంచి 20వ తేదీ వరకు నిర్వహించ నున్న ఆల్ ఇండియా సివిల్ సర్వీస్ ఉమెన్స్ వాలీబాల్ టోర్నీలో ఆమె పాల్గొననున్నారు. మంగళవారం పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు ఊర్మిళ, ఉపాధ్యాయులు, వ్యాయామ ఉపాధ్యాయులు ఆమెను అభినందించారు.

తైక్వాండోలో అయిజ యువకుడి ప్రతిభ

▸ జాతీయ స్థాయి పోటీల్లో బంగారు పతకం


ప్రదీప్‌సాగర్‌ను సన్మానిస్తున్న ట్రైనర్ మధుకుమార్

అయిజ, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి) : తైక్వాండో జాతీయ స్థాయి పోటీల్లో జోగుళాంబ గద్వాల జిల్లా, అయిజ పట్టణానికి చెందిన ప్రదీప్‌సాగర్ తైక్వాండో జాతీయ స్థాయి పోటీల్లో సత్తా చాటారు. ఈ నెల 6 నుంచి 8వ తేదీ వరకు ఆంధ్రప్రదేశ్‌లోని గుంటూరులో నిర్వహించిన తైక్వాండో జాతీయ స్థాయి పోటీలు, అండర్-54 విభాగంలో పాల్గొని బంగారు పతకాన్ని సాధించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు, మాస్టర్ ట్రైనర్ మధుకుమార్ ఆయనను ఘనంగా సన్మానించారు. భవిష్యత్‌లో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.

క్రైం కార్నర్

పిచ్చి కుక్క స్వైర విహారం

▸ 10 మందికి గాయాలు

జడ్చర్ల, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి) : మహబూబ్‌నగర్ జిల్లా, జడ్చర్ల మునిసిపాలిటీ పరిధిలో ఓ పిచ్చి కుక్క స్వైరవిహారం చేసింది. పట్టణంలోని నేతాజీ రోడ్డులో ఆటో దిగిన ఓ వ్యక్తిని, అదే దారిలో వెళ్తున్న ఓ చిన్నారిపై దాడి చేసి కరిచింది. అదే కుక్క కూరగాయల మార్కెట్‌వైపు వెళ్లి, మరికొందరిపై దాడి చేసింది. ఇలా దాదాపు పదిమందిని అది కరిచింది. వారందరూ చికిత్స కోసం జడ్చర్ల ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చినట్లు వైద్యులు తెలిపారు.

డ్రంకెన్ డ్రైవ్ కేసులో ముగ్గురికి జైలు శిక్ష

హన్వాడ, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి) : డ్రంకెన్ డ్రైవ్ తనిఖీల్లో పట్టుపడిన ముగ్గురికి జైలు శిక్ష విధిస్తూ న్యాయాధికారి తీర్పు వెల్లడించారు. హన్వాడ ఎస్ఐ వెంకటేశ్ తెలిపిన వివరాల ప్రకారం.. మహబూబ్ నగర్ జిల్లా హన్వాడలో ఇటీవల నిర్వహించిన డ్రంకెన్ డ్రైవ్ తనిఖీల్లో బుద్దారం గ్రామానికి చెందిన నాయిని రామాంజనేయులు, హన్వాడకు చెందిన కొనగంటి దత్తాత్రేయ, వికారాబాద్ జిల్లా, కుల్కచర్ల గ్రామానికి చెందిన ప్రశాంత్ పట్టుబడ్డారు. వారిని పోలీసులు మంగళవారం కోర్టులో హాజరుపరిచారు. రామాంజనేయులుకు రెండు రోజుల జైలు శిక్ష, రూ. 3 వేల జరిమాన, దత్తాత్రేయకు 3 రోజుల జైలు శిక్ష, రూ. 2 వేల జరిమాన, ప్రశాంత్‌కు ఒక్క రోజు జైలు శిక్ష, రెండు వేలు జరిమానా విధిస్తూ న్యాయాధికారి తీర్పు ఇచ్చారు.

రెండు తులాల బంగారు గొలుసు చోరీ

వడ్డేపల్లి, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి) : ఇంటి ముందు ఊడుస్తున్న ఓ మహిళ మెడలోనుంచి గుర్తుతెలియని వ్యక్తులు బంగారు గొలుసును లాక్కెళ్లారు. జోగుళాంబ గద్వాల జిల్లా, వడ్డేపల్లి మునిసిపాలిటీ కేంద్రమైన శాంతినగర్‌లో మంగళవారం ఉదయం ఈ సంఘటన జరిగింది. పట్టణానికి చెందిన రిటైర్డ్ ఉద్యోగి గోపాల్‌రావు భార్య రత్నకుమారి ఇంటి ముందు ఊడుస్తుండగా ఇద్దరు వ్యక్తులు బైక్‌పై వచ్చారు. పాల మద్దయ్య ఇల్లు ఎక్కడుందని బైక్ నడుపుతున్న వ్యక్తి ఆమెను అడుగుతుండగా, వెనుక కూర్చున్న వ్యక్తి ఆమె మెడలో నుంచి రెండు తులాల బంగారు గొలుసును లాక్కొని పరారయ్యారు. ఆమె పెద్దగా కేకలు వేయడంతో చుట్టుపక్కల వారు బైకులపై వారిని వెంబడించినా ఫలితం లేకపోయింది. ఈ విషయంపై శాంతినగర్ పోలీస్‌స్టేషన్లో ఫిర్యాదు చేశామని బాధితురాలి భర్త గోపాల్‌రావు తెలిపారు.

చెరువులో పడి యువకుడి మృతి

మహమ్మదాబాద్, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి) : చెరువులో పడి ఓ యువకుడు మృతి చెందాడు. మహబూబ్‌నగర్ జిల్లా మహమ్మదాబాద్ మండలంలోని గాధిర్యాల్ గ్రామంలో ఈ సంఘటన జరిగింది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. వికారాబాద్ జిల్లా, నవాబ్‌పేట మండలంలోని పూలిమామిడి గ్రామానికి చెందిన గణేష్ (22) రెండు రోజుల క్రితం గాధిర్యాల్ గ్రామంలోని బంధువుల ఇంటికి వచ్చాడు. మంగళవారం గ్రామ సమీపంలోని కొత్త చెరువుకు వెళ్లి దుస్తులను ఉతుకుతుండగా, ప్రమాదవశాత్తు జారి నీటిలో పడిపోయాడు. సమీపంలోని గొర్రెల కాపరులు గమనించి, గణేష్‌ను చెరువులో నుంచి బయటకు తీసుకురాగా, అప్పటికే అతడు మృతి చెందాడు. సంఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు బంధువులు తెలిపారు.

కిరాణా దుకాణంలో చోరీ


తెలకపల్లి, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి) : నాగర్‌కర్నూల్ జిల్లా, తెలకపల్లి మండలంలోని వట్టిపల్లిలోని ఓ కిరాణా దుకాణంలో చోరీ జరిగింది. ఎస్ఐ నరేశ్ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన సూర్యకల్యాణ్‌గౌడ్ కిరాణ దుకాణంలో సోమవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. దుకాణం తాళాలు విరగ్గొట్టి గల్లాపెట్టెలోని రూ.35 వేలు ఎత్తుకెళ్లారు. సంఘటనపై బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

విద్యుదాఘాతానికి గురైన కార్మికుడు

▸ త్రుటిలో తప్పిన ప్రాణాపాయం


స్తంభానికి ఉన్న ఇనుపకడ్డీపై పడిపోయిన కార్మికుడు బాబును కిందకు దించుతున్న కార్మికులు

బిజినేపల్లి, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి) : నాగర్‌కర్నూల్ జిల్లా, బిజినేపల్లి మండల కేంద్రంలో ఓ కార్మికుడు విద్యుదాఘాతానికి గురై, ప్రాణాపాయం నుంచి త్రుటిలో తప్పించుకున్నాడు. విద్యుత్‌శాఖ ఏఈ రాకేశ్‌రెడ్డి తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మండల కేంద్రంలోని 33/11 విద్యుత్ స్తంభాలకే గృహ అవసరాల కోసం నూతనంగా మరో లైన్ విద్యుత్ తీగలను బిగిస్తున్నారు. కాంట్రాక్టర్ సందీప్ గౌడ్ ఆధ్వర్యంలో పనులు చేయిస్తున్నారు. అందులో భాగంగా బిజినేపల్లి నుంచి మహబూబ్‌నగర్ వెళ్లే ప్రధాన రహదారి పక్కనున్న స్తంభానికి తీగలు లాగాల్సి ఉండింది. ఆ స్తంభానికి ఇప్పటికే రెండు విద్యుత్ లైన్లు ఉన్నాయి. పైనున్న బిజినేపల్లి ఫీడర్ లైన్‌కు ఎల్‌సీ (లైన్ క్లియరెన్స్) తీసుకున్నారు. కానీ కిందనున్న వెల్దండ ఫీడర్ లైన్‌కు ఎల్‌సీ తీసుకోకుండానే కార్మికుడు బాబు స్తంభంపైకి ఎక్కి తీగలు లాగుతుండగా విద్యుదాఘాతానికి గురయ్యాడు. అయితే అదృష్టవశాత్తు స్తంభానికి అడ్డంగా ఉన్న ఇనుప కడ్డీపై పడిపోయాడు. పక్కనే ఉన్న తోటి కార్మికులు అతడిని వెంటనే పట్టుకొని జాగ్రత్తగా కిందకు దించి, అపస్మారక స్థితిలో ఉన్న అతడికి స్థానిక ఆసుపత్రికి తరలించారు.


విద్యుత్ దీపాలంకరణలో జములమ్మ ఆలయం

నేడు పున్నమి వేడుకలు

▸ జములమ్మ ఆలయంలో ఏర్పాట్లు పూర్తి ▸ తెల్లవారుజామున 108 కలశాలతో ఊరేగింపు

▸ కృష్ణానది జలంతో అమ్మవారికి అభిషేకం ▸ పట్టు వస్త్రాలు సమర్పించనున్న ఎమ్మెల్యే దంపతులు

గద్వాల, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి) : జములమ్మ ఆలయంలో పౌర్ణమి వేడుకలకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఆలయాన్ని పూలతో అందంగా తీర్చిదిద్దారు. ఆలయ గోపురంతో పాటు ప్రాకారాలను విద్యుత్ దీపాలతో అలంకరించారు. బుధవారం తెల్లవారుజామున మూడు గంటల నుంచి పూజా కార్యక్రమాలు ప్రారంభం కానున్నాయి. ముందుగా అర్చకులు, ఆలయకమిటీ సభ్యులు, భక్తులు కృష్ణానదికి వెళ్లి, 108 కలశాలతో జలాన్ని ఊరేగింపుగా ఆలయానికి తీసుకొస్తారు. ఆ నీటితో అమ్మవారికి అభిషేకం చేయనున్నారు. అనంతరం అమ్మవారికి ఎమ్మెల్యే కృష్ణమోహన్‌రెడ్డి దంపతులు పట్టు వస్త్రాలు సమర్పిస్తారు. అలంకరణ తర్వాత అమ్మవారికి ప్రత్యేక పూజలు చేస్తారు. తెల్లవారుజామున నాలుగు గంటల నుంచి భక్తులు అమ్మవారిని దర్శించుకోవడానికి ఏర్పాట్లు పూర్తి చేశామని ఆలయ చైర్మన్ వెంకట్రాములు, ఈవో పురేందర్‌కుమార్ తెలిపారు.


పాదయాత్రికులను సన్మానిస్తున్న ఈవో పురేందర్‌కుమార్, చైర్మన్ వెంకట్రాములు

మంగళవారం అమ్మవారి దర్శనానికి లక్ష మంది భక్తులు తరలివచ్చారని చెప్పారు. పౌర్ణమి వేడుకలకు మరింత అధిక సంఖ్యలో వస్తారని తెలిపారు. దాదాపు 100 మంది పోలీసులతో బందోబస్తు ఏర్పాటు చేయనున్నట్లు రూరల్ ఎస్ఐ శ్రీకాంత్ తెలిపారు. వాహనాల రాకపోకలకు ఇబ్బంది కలుగకుండా చర్యలు తీసుకుంటామంటామన్నారు.

కర్ణాటక నుంచి ఆలయం వరకు..

220 కిలోమీటర్ల పాదయాత్ర

కర్ణాటక రాష్ట్రం, బాగల్‌కోట్ జిల్లా, ఇళికల్ గ్రామస్థులు 220 కిలోమీటర్లు పాదయాత్ర చేసి మంగళవారం జములమ్మ ఆలయానికి చేరుకున్నారు. వారికి ఆలయ అధికారులు సాదర స్వాగతం పలికి, ప్రత్యేక దర్శనం కల్పించారు. 11 ఏళ్ల క్రితం అశోక్ కాట్వా, శ్రీకాంత్ కాట్వా, చంద్రు కటారి, జయరాజ్ కాట్వాల ఆధ్వర్యంలో 11 మందితో ప్రారంభమైన జములమ్మ పాదయాత్ర ప్రతీ సంవత్సరం కొనసాగుతోంది. అలాగే ఈ సంవత్సరం కూడా 85 మంది భక్తులు అమ్మవారి దీక్ష చేపట్టి ఆరు రోజుల పాటు చెప్పులు ధరించకుండా, కాలినడకన అల యానికి చేరుకున్నారు. వారందరూ పౌర్ణమి నాడు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి దీక్షను విరమిస్తారు.


ఆలయ ప్రాంగణంలో విద్యుత్ దీపాల అలంకరణ, రేణుకా దేవి విగ్రహం

సొంతింటి కల సాకారం

▸ 240 మందికి డబుల్ బెడ్‌రూం ఇళ్లు ▸ నేడు గృహ ప్రవేశాలకు ఏర్పాట్లు పూర్తి

▸ ముఖ్య అతిథులుగా మంత్రులు సీతక్క జూపల్లి కృష్ణారావు, ఎంపీ మల్లురవి, ఎమ్మెల్యే కశిరెడ్డి నారాయణరెడ్డి


గృహ ప్రవేశాలకు సిద్ధమైన డబుల్ బెడ్‌రూం ఇళ్లు

కల్వకుర్తి, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి) : చాలా ఏళ్లుగా ఎదురుచూస్తున్న పేదల సొంతింటి కల నేడు నెరవేరనున్నది. నాగర్ కర్నూల్ జిల్లా, కల్వకుర్తిలో 240 మంది లబ్ధిదారులకు డబుల్ బెడ్‌రూం ఇళ్లు కేటాయించారు. వారందరూ బుధవారం గృహ ప్రవేశం చేయనున్నారు. కార్యక్రమానికి మంత్రులు సీతక్క, జూపల్లి కృష్ణారావు, ఎంపీ మల్లురవి, ఎమ్మెల్యే కశిరెడ్డి నారాయణరెడ్డి ముఖ్య అతిథులుగా హాజరు కానున్నారు. కల్వకుర్తి పట్టణంలోని 99 సర్వే నెంబరులో గత ప్రభుత్వం 240 డబుల్ బెడ్‌రూం ఇళ్లను నిర్మించింది. ఆ ఇళ్లకు విద్యుత్ సౌకర్యం, నీటి వసతి, పైపులైన్లు, ట్యాంకులు, ప్లంబర్ పనుల పూర్తికి ఎమ్మెల్యే కశిరెడ్డి నారాయణ రెడ్డి ప్రత్యేక చర్యలు తీసుకున్నారు. రూ.2.50 కోట్లు మంజూరు చేయించి, పనులను పూర్తి చేయించారు. లబ్ధిదారుల ఎంపిక కోసం అర్హులైన వారి నుంచి గతంలో ఆన్‌లైన్లో దరఖాస్తులను స్వీకరించిన అధికారులు, లక్కీ డిప్ ద్వారా లబ్ధిదారులను ఎంపిక చేశారు.

చాలా సంతోషంగా ఉంది



డబుల్ బెడ్ రూం ఇల్లు రావడం చాలా సంతోషంగా ఉంది. నేను, నా భర్త ఇద్దరమూ దివ్యాంగులమే. ప్రభుత్వం ఇచ్చే పింఛన్ మీదే ఆధారపడి జీవిస్తున్నాం. ఎలాంటి ఆధారమూ లేని మాకు డబుల్‌బెడ్రూం ఇల్లు మంజూరయ్యింది. ప్లాట్ నెంబరు-3ని మాకు కేటాయించారు.

- ఖాజాబీ, లబ్ధిదారు, కల్వకుర్తి

ఆత్మగౌరవం పెరిగింది



కూలి పని చేసుకుంటూ ఇద్దరు పిల్లలను పోషించుకుంటున్నాను. సొంత ఇల్లు లేక, కిరాయి ఇంట్లో ఇబ్బందులు పడుతున్నాను. ఇప్పుడు డబుల్ బెడ్‌రూం ఇల్లు రావడంతో చాలా ఆనందం కలిగింది. సొంత ఇల్లు సమకూరడంతో ఆత్మగౌరవం పెరిగింది.

- లలిత, లబ్ధిదారు

కమ్యూనిజాన్ని అంతం చేయలేరు

▸ కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు

▸ కమ్యూనిస్టులు సమాజ చైతన్య చోదకులు

▸ మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి



సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యేలు కూనంనేని సాంబశివరావు, వాకిటి శ్రీహరి

మక్తల్ రూరల్, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర హోంమంత్రి అమిత్ షా వెయ్యి జన్మలెత్తినా కమ్యూనిజాన్ని అంతం చేయలేరని కొత్తగూడెం ఎమ్మెల్యే, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివ రావు మండిపడ్డారు. నారాయణపేట జిల్లా, మక్తల్ మండల కేంద్రంలోని ఏఆర్ఎం ఫంక్షన్ హాల్‌లో మంగళవారం కార్మిక ఉద్యమ నాయకుడు సీహెచ్ కొండన్న సంస్మరణ సభ నిర్వహించారు. ముందుగా కొండన్న చిత్రపటానికి ఎమ్మెల్యేలు వాకిటి శ్రీహరి, సాంబశివరావు, సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డిలు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. అనంతరం ఎమ్మెల్యే కూనంనేని మాట్లాడుతూ పేద కుటుంబంలో జన్మించిన కొండన్న, చిన్నతనం నుంచే అభ్యుదయ భావాల వైపు ఆకర్షితుడయ్యాడన్నారు. ఎర్రజెండా నెత్తుకొని తాడిత పీడిత జనం పక్షాన కార్మిక కర్షక గొంతుకై నిలబడిన ధైర్యశాలి అన్నారు. మతోన్మాద భావజలాన్ని కూకటివేళ్లలో పెలికిస్తేనే భారత రాజ్యాంగానికి రక్షణ ఉంటుందన్నారు. ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి మాట్లాడుతూ కమ్యూనిస్టులు సమాజ చైతన్య చోదకులన్నారు. సమాజహితం కోసం ప్రాణాలను కూడా లెక్కచేయకుండా జనం పక్షాన పోరాటాలు సాగిస్తారన్నారు. కొండన్న అనునిత్యం ప్రజల పక్షాన గొంతు వినిపించేవాడని, అలాంటి వ్యక్తిని కోల్పోవడం ఈ ప్రాంతానికి తీరని నష్టమన్నారు. ఆయన కుటుంబానికి అండగా ఉంటామని హామీ ఇచ్చారు. సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ బీజేపీ పాలనలో దేశం అన్ని రంగాల్లో దివాలా తీస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. భారత సార్వభౌమాధికారాన్ని సామ్రాజ్యవాద దేశాలకు తాకట్టు పెడుతూ దేశ సంపదను కొల్లగొడుతున్నారని విమర్శించారు. కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఏం బాలనరసింహ, వనపర్తి జిల్లా కార్యదర్శి కె.విజయరాములు, మహబూబ్‌నగర్ జిల్లా కార్యదర్శి బి.బాలకిషన్, నారాయణపేట జిల్లా సమన్వయ కార్యదర్శి నరసింహ పాల్గొన్నారు.

కీర సాగు..
లాభాలు బాగు

▸ ఎకరాకు లక్ష రూపాయల వరకు ఆదాయం

▸ తక్కువ నీటితో ఎక్కువ దిగుబడి


అనంతపురం సమీపంలో రైతులు సాగు చేసిన కీర తోట

కోయిలకొండ, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి) : కీర దోస సాగు చేసి రైతులు తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభాలు పొందుతున్నారు. మహబూబ్‌నగర్ జిల్లా, కోయిలకొండ మండలంలోని అనంతపూర్, ఆచార్యపూర్, శేరివెంకటాపూర్ తదితర గ్రామాల్లో ఎక్కువ మంది రైతులు కీర సాగు చేస్తున్నారు. ఎకరం సాగుకు రూ. 30 వేల వరకు పెట్టుబడి అవుతోంది. విత్తనం వేసిన నెలలోనే మొదటి విడుత పంట కాపుకు వస్తుంది. రెండు నెలల్లో పంట పూర్తి అవుతుందని, సారవంతమైన భూములు ఉంటే మరింత దిగుబడి వస్తుందని రైతులు చెప్తున్నారు. విత్తనాలు అందించిన వారే రైతుల వద్దకు వచ్చి కీరా కొనుగోలు చేస్తారని, మొదటి రకం కీరా క్వింటాలుకు రూ. 4 వేల నుంచి రూ. 4,500 వరకు ధర వస్తుందని, రెండవ రకం క్వింటాలుకు రూ. 2500 వరకు ధర పలుకుతోందని చెప్తున్నారు. డ్రిప్ పద్ధతిని వినియోగిస్తున్నందున తక్కువ నీటితోనే పంట చేతికి వస్తోందని అంటున్నారు. ఆరుతడి పంటలు, కూరగాయల సాగు చేస్తున్న రైతులకు ఉద్యాన శాఖ నుంచి ప్రోత్సాహం అందిస్తే మరిన్ని లాభాలు సంపాదించవచ్చని రైతులు చెప్తు న్నారు. సాగుకు అవసరమైన విత్తనాలు, డ్రిప్ పరి కరాలు అందించాలని కోరుతున్నారు. సరైన ప్రోత్సాహం అందిస్తే కూరగాయల సాగు మరింత పెరిగే అవకాశం ఉందని అభిప్రాయపడుతున్నారు.

ఐదేళ్లుగా కీర సాగు



నేను రెండు ఎకరాల కౌలుకు తీసుకొని ఐదు సంవత్సరాలుగా కీర సాగు చేస్తున్నారు. తక్కువ నీటితో సాగవుతుంది, తొందరగా కాపుకు వస్తోంది. ఉద్యాన శాఖ నుంచి ప్రోత్సాహం, సహకారం అందిస్తే బాగుంటుంది. ఎక్కువ మంది రైతులు కూరగాయల సాగుపై మొగ్గు చూపే అవకాశం ఉంటుంది.

- రాములు యాదవ్, అనంతపురం

అవగాహన కల్పించాలి



నేను ఒక ఎకరంలో కూరగాయలు సాగు చేస్తున్నాను. కానీ సరైన అవగాహన లేక ఇబ్బంది పడుతున్నాను. విత్తనాల ఎంపిక, సాగులో తీసుకోవాల్సిన జాగ్రత్తలు తెలియక నష్టపోతున్నాం. అధికారులు స్పందించి క్షేత్ర స్థాయిలో పంటలను పరిశీలించి, అవసరమైన సూచన లు, సలహాలు ఇవ్వాలి.

- శ్రీహరిగౌడ్, ఖాజీపూర్ రైతు

వర్గీకరణ అమలు
శుభపరిణామం

▸ ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ పిడమర్తి రవి

▸ మాదిగ అమరవీరుల కుటుంబాలను ఆదుకోవాలి


ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి, ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ పిడమర్తి రవిలను సన్మానిస్తున్న నాయకులు

పాలమూరు, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో ఎస్సీ వర్గీకరణ అమలుకు పూనుకోవడం శుభపరిణామమని ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ పిడమర్తి రవి అన్నారు. మాదిగ జేఏసీ ఆధ్వర్యంలో మహబూబ్‌నగర్ పట్టణంలో మంగళవారం ర్యాలీ నిర్వహించారు. అనంతరం టీఎన్‌జీవోస్ భవనంలో నాయకులు బొర్ర సురేశ్, గడ్డమీది గోపాల్ అధ్యక్షతన నిర్వహించిన ధన్యవాద సభలో ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డితో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమకారులను గుర్తించినట్లుగానే మాదిగ అమరవీరులను గుర్తించాలని కోరారు. ఉద్యమ సమయంలో నమోదైన కేసులను ఎత్తివేయాలన్నారు. బాధిత కుటుంబాలను ఆదుకోవాలని, వారికి డబుల్ బెడ్‌రూం ఇళ్లు ఇవ్వాలని కోరారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వర్గీకరణ అమలుకు పూనుకోవటం సంతోషంగా ఉందన్నారు. అందుకు సహకరించిన మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. మాదిగలు ప్రభుత్వానికి అండగా నిలవాలని కోరారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథులను గజమాలతో సన్మానించారు. సభలో ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు రాయికంటి రాందాసు, సింగిరెడ్డి పరమేశ్వర్, ప్రజాసంఘాల జేఏసీ నాయకులు ఎం. ప్రవీణ్‌కుమార్, మెట్టుయాదన్న, దండుదేవన్న, ఎన్.శ్రీనివాస్, కొత్తపల్లి కృష్ణ, దినేశ్, మొగులయ్య, రంగస్వామి, రాజారామ్, అరుణ్ ప్రసంగించారు.

న్యూస్ బాక్స్

శ్రీకృష్ణ ఆలయానికి విరాళం

మదనాపురం, ఫిబ్రవరి 11, (ఆంధ్రజ్యోతి) : కొత్తకోట పట్టణంలో నూతనంగా నిర్మిస్తున్న శ్రీకృష్ణ ఆలయానికి మండలంలోని కొన్నూరు గ్రామానికి చెందిన ప్రముఖ సామాజిక వేత్త శరత్‌రెడ్డి విరాళం అందజేశారు. మంగళవారం ఆయన స్వగృహంలో ఆలయ కమిటీ సభ్యులు విగ్రహ ప్రతిష్ఠాపన కోసం హాజరుకావాలని కోరగా.. తన వంతుగా రూ.1,50,116 అందజేశారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు ఆయన్ను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో కృష్ణారెడ్డి, శంకర్‌యాదవ్, సత్యంయాదవ్, తిమ్మన్నయాదవ్, బాలకొండన్న యాదవ్, హనుమంతు యాదవ్, రాములు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల కాంప్లెక్స్ సమావేశం

పాన్‌గల్, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి) : ఆంగ్ల ఉపాధ్యాయుల కాంప్లెక్స్ సమావేశం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈవో శ్రీనివాస్ మాట్లాడారు. రాబోయే కాలం సాంకేతిక నైపుణ్యాలతో కూడుకున్న కాలమని, ఖచ్చితంగా ఉపాధ్యాయులందరూ సాంకేతిక నైపుణ్యాల్ని అలవర్చుకొని వాటిని వినియోగించుకుంటూ బోధిస్తే విద్యార్థులకు సరళంగా అర్థం అవుతుందని తెలియజేశారు. వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

చికెన్ తినొద్దంటూ ప్రచారం

కొత్తకోట, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలో మునిసిపల్ అధికారులు చికెన్ తినొదంటూ ఆటో ద్వారా మంగళవారం ప్రచారం చేపట్టారు. ఇటీవల కోళ్లకు వస్తున్న వ్యాధులను దృష్టిలో పెట్టుకొని ప్రభుత్వం చికెన్ అమ్మకాలు నిర్వహించరాదని ఉత్తర్వులు జారీ చేసింది. అందులో భాగంగానే మునిసిపల్ కమిషనరు సైదవులు కోళ్లకు ఏవీఎస్ ఇన్‌ఫ్లూయెంజా వ్యాధి సోకి కుప్పలు కుప్పలుగా మృతి చెందుతున్నాయని, ఈ సమయంలో చికెన్ తింటే ప్రజలు అనారోగ్యం బారిన పడే అవకాశం ఉంటుందని, దుకాణందారులు అమ్మకాలు జరపరాదని ప్రచారం నిర్వహించారు.

విగ్రహ ప్రతిష్ఠాపన ఆహ్వాన పత్రిక ఆవిష్కరణ

వనపర్తి రాజీవ్‌చౌరస్తా, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి) : జిల్లా కేంద్రంలోని పాత బజార్‌లో వీరాంజనేయ స్వామి ధ్వజస్తంభం, విగ్రహ ప్రతిష్ఠాపన ఆహ్వాన పత్రికను మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి ఆవిష్కరించారు. మంగళవారం పట్టణంలోని బాలానగర్ అభయ అంజనేయ స్వామిని ఆయన దర్శించుకుని అనంతరం ఆహ్వాన పత్రికను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు మాజీ మంత్రిని శాలువాతో ఘనంగా సన్మానించారు. ఆలయ నిర్మాణం కోసం గతంలో రూ.5 లక్షలు కేటాయించి నిరంజన్‌రెడ్డి సహకారం అందించినట్లు తెలిపారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు వాకిటి శ్రీధర్, నందిమల్ల అశోక్, తిరుమల్, గిరి, వెంకటయ్య, మురళి, ప్రభాకర్, రవి, బాలస్వామి, రవిసాగర్, నీలస్వామి, శ్రీను, బీరయ్య యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

రుణమాఫీ చేయాలని రైతుల బైఠాయింపు



గ్రామ పంచాయతీ కార్యాలయం ఎదుట బైఠాయించిన రైతులు

ఖిల్లాఘణపురం, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి) : రుణమాఫీ చేయాలని రైతులు బైఠాయించిన ఘటన వనపర్తి జిల్లా ఖిల్లాఘణపురం మండలం సూరాయపల్లి గ్రామంలో మంగళవారం చోటుచేసుకున్నది. గ్రామ పంచాయతీ కార్యాలయం ముందు జరిగిన ఆందోళనలో మాజీ సర్పంచ్ బాలస్వామి మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం 2 లక్షల వరకు రుణమాఫీ చేసినట్లు ప్రకటనలు చేస్తున్నా.. గ్రామాల్లో రైతులకు పూర్తిస్థాయిలో రుణమాఫీ జరగడంలేదని అన్నారు. రెండు లక్షలకు పైన రుణం ఉన్న రైతులు అప్పులు చేసి బ్యాంకుల్లో డబ్బులు జమ చేశారని, ఇప్పటికీ రుణమాఫీ కాకపోవడంతో వడ్డీల భారంతో రైతులు ఆందోళన చెందుతున్నారన్నారు. టెక్నికల్ సమస్యలని చెబుతుండటంతో నెలల తరబడి రుణమాఫీ కోసం రైతులు బ్యాంకుల చుట్టూ ప్రదక్షిణలు చేసి అలసిపోయారని అన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి రైతులందరికీ రుణమాఫీ చేసి ఆదుకోవాలని కోరారు.

హక్కులను వినియోగించుకోవాలి

వనపర్తి క్రైమ్ ,ఫిబ్రవరి11 (ఆంధ్రజ్యోతి) : రాజ్యాంగం కల్పించిన హక్కులను ప్రతీ ఒక్కరు వినియోగించుకోవాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎం.ఆర్ సునీత అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని బుడగ జంగాల కాలనీలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో కాలనీవాసులకు చట్టాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఆమె హాజరై మాట్లాడారు. తల్లిదండ్రులు పిల్లలకు మంచి గురువులుగా మారి భవిష్యత్తుకు మార్గదర్శకులు కావాలని పిలుపునిచ్చారు. ఆడపిల్లలను బాల్య వివాహాలకు దూరంగా ఉంచాలని లింగ బేధాలకు అతీతంగా అందరికీ సమాన అవకాశాలను కల్పించాలని తెలిపారు. బాల కార్మికుల చట్టాల గురించి వివరించారు. చట్టాలపై అవగాహన పెంచుకుని జీవితంలో ఎదురయ్యే అన్ని సమస్యలను పరిష్కరించుకోవాలని సూచించారు.



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎం.ఆర్ సునీత

కంటిచూపు సరిగా ఉంటేనే చదువుపై దృష్టి



కంటి పరీక్షలను పరిశీలిస్తున్న కలెక్టర్ ఆదర్శ్ సురభి

వనపర్తి రూరల్, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులకు కంటి చూపు సరిగా ఉన్నప్పుడే చదువుపై చక్కగా దృష్టి కేంద్రీకరించగలరని, అందుకోసమే జిల్లాలోని విద్యార్థులకు ఉచిత కంటి పరీక్షల కార్యక్రమం చేపట్టినట్లు కలెక్టర్ ఆదర్శ్ సురభి తెలిపారు. మంగళవారం కలెక్టర్ ఆదేశాల మేరకు జిల్లా కేంద్రంలోని జడ్పీ ప్రభుత్వ బాలుర పాఠశాలలో విద్యార్థులకు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో కంటి పరీక్షలు నిర్వహించి, కంటి చూపు సమస్యలు ఉన్న వారికి ఉచితంగా కళ్లద్దాలను పంపిణీ చేశారు. కలెక్టర్ మాట్లాడుతూ... విద్యార్థులు చదువుపై దృష్టి సారించాలంటే కంటి చూపు ఎంతో కీలకమని అన్నారు. అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు సంచిత్ గంగ్వార్ మాట్లాడుతూ.. విద్యార్థులు కంటి చూపు సరిగా ఉన్నప్పుడే బాగా చదవగలరని భావించిన కలెక్టర్ తన నిధుల నుంచి ప్రత్యేకంగా విద్యార్థుల కోసం ఉచితంగా కళ్లద్దాల పంపిణీ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని చెప్పారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి శ్రీనివాసులు, వైద్య సిబ్బంది, పాఠశాల ప్రిన్సిపాల్, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రతిపాదనలు సిద్ధం చేయాలి

వనపర్తి అర్బన్ : హైబ్రిడ్ యన్యూటి మోడల్ ప్రోగ్రాం కింద జిల్లా కేంద్రం నుంచి హైవే రోడ్డు, మండల కేంద్రం నుంచి జిల్లా కేంద్రానికి, గ్రామపంచాయతీ నుంచి మండల కేంద్రానికి రోడ్డు అభివృద్ధికి ప్రతిపాదనలు సిద్ధం చేసి పంపాలని కలెక్టర్ ఆదర్శ్ సురభి అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ చాంబర్‌లో అదనపు కలెక్టర్ లోకల్ బాడీస్ సంచిత్ గంగ్వార్‌తో కలిసి రోడ్లు, భవనాలు, పంచాయతీ రాజ్ ఇంజినీరింగ్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్రంలో రోడ్లు లేని గ్రామాలకు బీటీ రోడ్లు వేయించడం, ఉన్న రోడ్లను మరింత అభివృద్ధి పరిచేందుకు హైబ్రిడ్ యాన్యూటి మోడల్ ప్రోగ్రాం రూపొందించడం జరిగిందన్నారు. 15 సంవత్సరాల పాటు నిర్వహణతో కూడిన రోడ్ల అభివృద్ధికి వనపర్తి జిల్లా నుంచి సైతం ప్రతిపాదనలు పంపాల్సి ఉన్నందున ప్రాముఖ్యానుసారం ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు. ఆర్‌అండ్‌బీ కింద వనపర్తి, కొత్తకోట రోడ్డును కొత్తకోట వరకు నాలుగు వరుసల రోడ్డు, వనపర్తి నుంచి బిజినేపల్లి మీదుగా జడ్చర్ల రోడ్డును నాలుగు వరుసల రోడ్డుగా అభివృద్ధి చేసేందుకు ప్రతిపాదనలు పెట్టాలని సూచించారు. అదేవిధంగా వనపర్తి, పెబ్బేరు రోడ్డు, రాజనగరం నుంచి పెద్దమందడి ఉన్న రోడ్డును రెండు వరుసల రోడ్డుగా అభివృద్ధి చేసేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు. మిగిలిన రోడ్లను సైతం అభివృద్ధి చేసేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు. పంచాయతీ రాజ్ శాఖకు సంబంధించి గ్రామ పంచాయతీ నుంచి మండలానికి బీటీ రోడ్డు అనుసంధానం లేని పెబ్బేరు మండలం రాంపూర్ నుంచి రామమ్మ పేట, కనిమెట్ట నుంచి పాత జంగమాయపల్లి వరకు 7.30 కి.మీ. రోడ్డును బీటీ రోడ్డుగా మార్చేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు. అదే విధంగా గ్రామ పంచాయతీల నుంచి మండల కేంద్రాలకు ఉన్న రోడ్లను మరింత మెరుగు పరిచేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేసి ఇవ్వాలని ఆదేశించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ సంచిత్ గంగ్వార్, రోడ్లు భవనాల శాఖ కార్యనిర్వాహక ఇంజినీరు దేశ్యానాయక్, పంచాయతీ రాజ్ శాఖ కార్యనిర్వాహక ఇంజినీరు మల్లయ్య, డీఈలు సీతారామ స్వామి పాల్గొన్నారు.

నూతన బీటీ రోడ్లకు శిలాఫలకం



నూతన బీటీ రోడ్డు నిర్మాణానికి శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యేలు మేఘారెడ్డి, రాజేష్ రెడ్డి

ఖిల్లాఘణపురం, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి) : నాగర్‌కర్నూల్, వనపర్తి నియోజకవర్గం మారుమూల గ్రామాల్లో రవాణా వ్యవస్థను మెరుగుపరచడానికి మంగళవారం ఎమ్మెల్యేలు మేఘారెడ్డి, రాజేష్ రెడ్డి శ్రీకారం చుట్టారు. మండలంలోని సల్కెలాపూర్ గ్రామం నుంచి నాగర్‌కర్నూల్ నియోజకవర్గం గౌరారం వరకు నూతన బీటీ రోడ్డు నిర్మాణానికి ప్రభుత్వం మంజూరు చేసిన 2 కోట్ల 25 లక్షల నిధుల పనులకు ఎమ్మెల్యేలు శిలాఫలకం ఆవిష్కరించి భూమిపూజ చేశారు. నియోజకవర్గాలకు చివరి గ్రామాలుగా ఉండడంతో గత ప్రభుత్వాలు రవాణా వ్యవస్థను పట్టించుకోలేదని గుర్తు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేలు మాట్లాడుతూ... మారుమూల ప్రాంతాల ప్రజల దశాబ్దాల కాలం నాటి చిరకాల వాంఛ నెరవేర్చడానికి బీటీ రోడ్డు నిర్మాణం చేపట్టడం సంతోషంగా ఉందన్నారు. నియోజకవర్గాల మధ్య సమన్వయంతో గ్రామాల అభివృద్ధి వేగవంతం అవుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల నామమాత్రపు జాబితా విడుదల



ఆత్మకూరు మండల పరిషత్ కార్యాలయంలో పోలింగ్ కేంద్రాల నామమాత్రపు జాబితాను విడుదల చేస్తున్న అధికారులు

ఆత్మకూరు, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి) : త్వరలో జరగనున్న ఎంపీటీసీ, జెడ్పీటీసీ నామమాత్రపు పోలింగ్ కేంద్రాల జాబితాను విడుదల చేసినట్లు జిల్లా ఎన్నికల సహాయ అధికారి శ్రీరామ్ రెడ్డి తెలిపారు. ఆత్మకూరు మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం పోలింగ్ కేంద్రాల జాబితాను మండల పరిషత్ సిబ్బందితో కలిసి విడుదల చేశారు. అనంతరం మాట్లాడారు. మండలంలో 13 గ్రామ పంచాయతీలకుగాను ఏడు ఎంపీటీసీ స్థానాలు, ఒక జడ్పీటీసీ స్థానం ఉండగా... 32 పోలింగ్ స్టేషన్లను ఏర్పాటు చేశామని తెలిపారు. వీటిపై అభ్యంతరాలు ఉంటే 13వ తేదీ వరకు తెలియజేయాలని, అదే రోజు అభ్యంతరాలు స్వీకరించి 14వ న కలెక్టర్‌కు పంపనున్నామని చెప్పారు. 15న తుది జాబితా విడుదల చేయనున్నట్లు తెలిపారు. పార్వతమ్మ, విజయ్ కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

ఇంటర్నెట్‌ను సురక్షితంగా వినియోగించాలి



ఇంటర్నెట్‌పై అవగాహన కల్పిస్తున్న నేషనల్ ఇన్ఫర్మేటిక్ సెంటర్ సిబ్బంది మురళీకృష్ణ

వనపర్తి అర్బన్, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి) : ఇంటర్నెట్‌ను సురక్షితంగా వినియోగించడంతో పాటు ప్రతీ ఒక్కరు అవగాహన కలిగి ఉండాలని నేషనల్ ఇన్ఫర్మేటిక్ సెంటర్ సిబ్బంది అన్నారు. మంగళవారం అంతర్జాతీయ సేఫర్ ఇంటర్నెట్ డే సందర్భంగా కలెక్టరేట్‌లోని హాల్లో ఉద్యోగులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్రతీఒక్కరు రక్షిత ఇంటర్నెట్‌పై అవగాహన కలిగి ఉండాలని, సైబర్ ఫ్రాడ్స్ బారిన పడకుండా జాగ్రత్త పడాలని సూచించారు. సిబ్బంది మురళీకృష్ణ, సంధ్యరాణి, శ్రావణ్ కుమార్, ఈడీఎం విజయ్ కుమార్ పాల్గొన్నారు.

క్షయ రహిత గ్రామాలే లక్ష్యం



పరీక్షలు నిర్వహిస్తున్న సిబ్బంది

గోపాల్‌పేట, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని గ్రామాలన్నీ క్షయ రహిత గ్రామాలుగా నిర్మిద్దామని మండల వైద్య అధికారి శ్రీకృష్ణ కుమారి అన్నారు. మంగళవారం మండలంలోని బుద్దారంలో ప్రజలకు క్షయ పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ కృష్ణకుమారి మాట్లాడారు. మండలంలోని గ్రామాల్లో ప్రజలు ఉచితంగా నిర్వహిస్తున్న క్షయ వ్యాధి పరీక్షలను సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. బుద్దారంలో 108 మందికి క్షయ వ్యాధి పరీక్షలు నిర్వహించగా.. ఇద్దరికి క్షయ వ్యాధి నిర్ధారణ అయ్యిందని అన్నారు. మంగళవారం పొలికెపాడ్, బుధవారం చెన్నూర్, గురువారం తాడిపర్తి, శుక్రవారం జయన్న తిరుమలాపూర్, శనివారం చాకల్‌పల్లి, గ్రామాల్లోని హెల్త్ సబ్ సెంటర్లలో క్షయ వ్యాధి పరీక్షలు నిర్వహిస్తామని చెప్పారు.

పన్నులు చెల్లించి అభివృద్ధికి సహకరించాలి



పన్ను వసూలు చేస్తున్న మునిసిపల్ కమిషనర్

ఆత్మకూరు, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి) : పట్టణ ప్రజలు సకాలంలో ఇంటి, నీటి, వ్యాపార, వంటి పన్నులు చెల్లించి పట్టణ అభివృద్ధికి సహకరించాలని మునిసిపల్ కమిషనర్ శశిధర్ పేర్కొన్నారు. ఆత్మకూరు పట్టణ కేంద్రంలో మంగళవారం మునిసిపల్ బిల్ కలెక్టర్లు, సిబ్బందితో కలిసి పన్ను వసూలు కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఆత్మకూరు పట్టణ కేంద్రంలో రెండు కోట్ల ముప్పై ఎనిమిది లక్షల రూపాయల పన్నుల వసూలు చేయాల్సి ఉండగా.. ఇప్పటి వరకు 82 లక్షలు మాత్రమే పట్టణ ప్రజలు చెల్లించారని చెప్పారు. పన్నుల చెల్లింపుల్లో నిర్లక్ష్యం వహిస్తే పట్టణ అభివృద్ధి అకారణంగా నిలిచిపోయే అవకాశం ఉందన్నారు.

తక్కువ ధరకే ఇసుక

వనపర్తి అర్బన్, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో గృహ నిర్మాణాలు చేపడుతున్న ప్రజలకు మన ఇసుక వాహనం ద్వారా తక్కువ ధరకే ఇసుక ఇవ్వడం జరుగుతుందని కలెక్టర్ ఆదర్శ్ సురభి ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలు ఎవరూ అధిక ధరతో అక్రమ ఇసుక కొనవద్దని అక్రమ వ్యాపారులను ప్రోత్సహించవద్దని సూచించారు. హెచ్‌టీటీపీ://టీఎస్‌ఎంఐవి.సీజీజీ.జీవోవి. ఇన్ వెబ్‌సైట్ ద్వారా తన ఫోన్ నెంబర్‌తో లాగిన్ అయి అవసరమైన మేరకు మన ఇసుక వాహనం ద్వారా బుక్ చేసుకోవచ్చన్నారు. ఇసుక రీచ్ సమీప దూరాన్ని బట్టి రూ.1750 నుంచి గరిష్ఠంగా రూ.3,750 వరకు ఇసుక ఇంటి వద్దకే డంప్ చేయడం జరుగుతుందన్నారు. మన ఇసుక వాహనం ద్వారా ఇసుక బుక్ చేసుకోవడం చాలా సులువని, జిల్లా ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఏమైనా ఇబ్బందులు ఉంటే కలెక్టరేట్ హెల్ప్‌లైన్ సెంటర్‌కు ఫోన్ చేయాలని ఎట్టి పరిస్థితుల్లో అక్రమ ఇసుక వ్యాపారస్తులను ప్రోత్సహించవద్దని సూచించారు. జిల్లా ప్రజల అవసరార్థం 12 రీచ్‌ల ద్వారా ఇసుకను మన ఇసుక వాహనం యాప్ ద్వారా సరఫరా చేస్తున్నామని, అలాంటప్పుడు ఎక్కువ ధరకు అక్రమ ఇసుక ఎందుకు కొనుగోలు చేయాలని సూచించారు.

అంబేడ్కర్ స్టడీ భవన్‌కు కుర్చీలు వితరణ

పెద్దమందడి, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని అంబేడ్కర్ స్టడీ భవన్‌కు స్టడీ కుర్చీలు, ప్యాడ్స్‌ను ఏసీటీవో ప్రసన్నకుమార్‌రెడ్డి వితరణ చేశారు. రైజింగ్ హాండ్స్ సొసైటీ టీం ఏసీటీవో కలిసి మా కాలనీ యువత కోసం చదువుకోవడానికి స్టడీ చైర్స్‌ను అందించాలని కోరగా.. వెంటనే స్పందించి సొసైటీకి పన్నెండు స్టడీ చైర్స్ ప్యాడ్స్ అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. యువత అన్ని రంగాల్లో రాణించాలని, ఉన్నత చదువులు చదివి తల్లిదండ్రులకు మంచిపేరు తీసుకురావాలని సూచించారు. రైజింగ్ హ్యాండ్స్ సొసైటి టీం తరఫున ప్రసన్నకుమార్ రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

ఈదమ్మ అమ్మవారికి సారె

గోపాల్‌పేట, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలో ఈదమ్మ తల్లికి బోనాల పండుగ నిర్వహించారు. సోమవారం మండల కేంద్రంలోని ఈదమ్మ జాతర సందర్భంగా మాజీ సర్పంచ్ శ్రీనివాసులు, వారి సతీమణి సరితతో కలిసి అమ్మవారికి చీర వడి బియ్యం(సారె) అందించారు. సాయంత్రం అమ్మవారికి గ్రామ ప్రజలు బోనాలు సమర్పించారు.

ఆలయంలో మాజీ మంత్రి పూజలు

ఖిల్లాఘణపురం, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని గట్టుకాడిపల్లి, అంజనగిరి క్షేత్రం వేంకటేశ్వర స్వామి ఆలయంలో నిర్వహిస్తున్న వార్షిక బ్రహ్మోత్సవాల్లో మంగళవారం మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయంలో భక్తులు వేంకటేశ్వర స్వామిని ఉదయం గజవాహనంపై, సాయంత్రం హంస వాహనంపై ఊరేగించారు. మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి మాట్లాడుతూ.. గట్టుకాడిపల్లి అంజనగిరి క్షేత్రం వేంకటేశ్వర స్వామి ఆలయ అభివృద్ధికి కృషి చేసినట్లు తెలిపారు. ఆలయం దినదిన అభివృద్ధి జరుగుతుందని, రాబోయే కాలంలో దేవాలయం అభివృద్ధి కోసం తన వంతు సహకారం అందిస్తానని అన్నారు. ఆలయ పూజారులు మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డిని పట్టు వస్త్రాలతో సన్మానించి ఆశీర్వాదం అందజేశారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు రాళ్ల కృష్ణయ్య, కృష్ణానాయక్, లక్ష్మారెడ్డి, సామ్యానాయక్ పాల్గొన్నారు.

రైతు పక్షపాతి ప్రభుత్వం

వనపర్తి రాజీవ్‌చౌరస్తా, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి) : పంట పెట్టుబడి సాయం కోసం ఎదురుచూస్తున్న రైతులకు రాష్ట్ర ప్రభుత్వం రెండో విడత పెట్టుబడి సాయం సోమవారం అందించిందని కిసాన్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు వేముల శ్రీనివాస్ రెడ్డి అన్నారు. రాష్ట్రంలోని రైతు పక్షపాతి ప్రభుత్వం కొనసాగుతుందని మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. రెండు ఎకరాలు సాగు భూమి ఉన్న రైతుల ఖాతాల్లోనూ పంట పెట్టుబడి సాయం నిధులను జమ చేసినట్లు వివరించారు. యాసంగి 2024-25 పంట సీజన్‌లో రైతు భరోసా పథకం కింద రెండు ఎకరాల్లోపు రైతులకు నిధులు విడుదల అయ్యాయని అన్నారు. రూ.34,40,23,950 జిల్లాకు నిధులు విడుదల అయినట్లు పేర్కొన్నారు.

అనుమతి లేకుండా ఇసుక రవాణా చేస్తే చర్యలు



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్, ఎస్పీ

వనపర్తి అర్బన్, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో అక్రమ ఇసుక వ్యాపారం చేసే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ ఆదర్శ్ సురభి హెచ్చరించారు. మంగళవారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో ఎస్పీ రావుల గిరిధర్, అదనపు కలెక్టర్ రెవెన్యూ వెంకటేశ్వర్లు, స్టేషన్ హౌస్ ఆఫీసర్లు, తహసీల్దార్లతో జిల్లాస్థాయి సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ... జిల్లాలో 12 ఇసుక రీచ్‌లు ఉన్నాయని, గృహ నిర్మాణాలు చేపడుతున్న జిల్లా ప్రజలకు మన ఇసుక వాహనం ద్వారా తక్కువ ధరకే ఇసుకను ఇంటి వద్దకు సరఫరా చేస్తున్నామని తెలిపారు. మన ఇసుక వాహనం ద్వారా కాకుండా రీచ్‌ల నుంచి అక్రమంగా ఇసుక తరలించి జిల్లా ప్రజలకు, ఇతర జిల్లాలకు అధిక ధరకు అక్రమంగా రవాణా చేస్తున్న వారిని గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రతీ రీచ్‌కు తహసీల్దార్, ముగ్గురు పోలీస్ సిబ్బంది ఒక రెవెన్యూ సిబ్బందితో ఎన్‌ఫోర్స్‌మెంట్ బృందాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రతీ రీచ్ వద్ద సీసీ కెమెరాలు, లైట్లు ప్రచార ఫ్లెక్సీలు పెట్టాలని రెవెన్యూ అధికారులను ఆదేశించారు. ఎస్పీ రావుల గిరిధర్ మాట్లాడుతూ... అక్రమ ఇసుక వ్యాపారంపై ఉక్కుపాదం మోపేందుకు పోలీస్ ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు అందాయని, రెవెన్యూ అధికారులతో కలిసికట్టుగా పనిచేసి ఎక్కడికక్కడ తనిఖీలు నిర్వహించి అక్రమ ఇసుక రవాణాను అరికట్టేందుకు తన వంతు కృషి చేస్తానని చెప్పారు. మండల పోలీస్ అధికారులు బాధ్యతాయుతంగా పని చేసి అక్రమ ఇసుక రవాణాను అరికట్టి జిల్లా రెవెన్యూ పెంచేందుకు కృషి చేయాలని సూచించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ రెవెన్యూ వెంకటేశ్వర్లు, డీఎస్పీ వెంకటేశ్వరరావు, ఆర్డీవో సుబ్రహ్మణ్యం, సీఐలు, స్టేషన్ హౌస్ ఆఫీసర్లు, తహసీల్దార్లు, మైనింగ్ అధికారులు పాల్గొన్నారు.

బాల్య వివాహాల నిర్మూలనకు కృషి చేయాలి

వనపర్తి క్రైమ్, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి) : బాల్య వివాహాల నిర్మూలనకు కృషి చేయాలని, బాల్యవివాహం చేసుకున్న ప్రోత్సహించినా... వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఎస్పీ రావుల గిరిధర్ అన్నారు. మంగళవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో జిల్లా బాలల సంరక్షణ శాఖ, జిల్లా మహిళా, శిశు సంక్షేమ శాఖ భరోసా అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడారు. జిల్లాలో బాల్య వివాహాలు జరగకుండా తీసుకోవాల్సిన బాధ్యత ప్రతీ ఒక్క అధికారిపై ఉందని, ఇలాంటి సంఘటనలు చోటుచేసుకోవడానికి వీల్లేదని ఆదేశించారు. బాల్య వివాహాలకు బాధ్యులైన తల్లిదండ్రులు, బంధువులు, పూజారులు ప్రతీ ఒక్కరిపై కేసు నమోదు చేయాలని సూచించారు. రెండేళ్లలో బాల్య వివాహాలకు సంబంధించిన జాబితా తీసి విచారించి బాధ్యులపై కేసులు నమోదు చేయాలని ఆదేశించారు. బాలల సంరక్షణకు 24 గంటలు హెల్ప్‌లైన్ ఫోన్ నెంబర్ 1098 అందుబాటులో ఉంటుందని, దీనిపై ప్రజల్లో అవగాహన కల్పించాలన్నారు. 18 ఏళ్లలోపు పిల్లలను పనిలో పెట్టుకోవడం నేరమన్నారు. సమావేశంలో డీసీఆర్‌బీ, డీఎస్పీ ఉమామహేశ్వరరావు, డీడబ్ల్యూవో సుధారాణి, స్పెషల్ బ్రాంచ్ సీఐ నరేష్, షీ టీం ఎస్‌ఐ అంజద్, డీసీఆర్‌బీ ఎస్‌ఐ తిరుపతిరెడ్డి, డీసీపీవో రాంబాబు, భరోసా కోఆర్డినేటర్ శిరీష, సఖి కేంద్రం భరోసా కేంద్రం డీసీపీ యూనిట్ సిబ్బంది పాల్గొన్నారు.

సమాజానికి వన్నె తెచ్చే వారిని సన్మానించుకుందాం



రిటైర్డ్ ఉద్యోగిని సన్మానిస్తున్న సతీష్ యాదవ్

వనపర్తి రూరల్, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి) : సమాజానికి వన్నె తెచ్చే ఉద్యోగులను సన్మానించుకుందామని అఖిలపక్ష ఐక్యవేదిక జిల్లా అధ్యక్షుడు సతీష్ యాదవ్ అన్నారు. మంగళవారం వనపర్తి పట్టణ కేంద్రంలోని అఖిలపక్ష ఐక్యవేదిక కార్యాలయంలో రాష్ట్రపతి అవార్డు గ్రహీత గణిత అవధాని, రిటైర్డ్ టీచర్ అనంతప్ప యాదవ్‌ను శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. సమాజానికి అక్కరకు వచ్చే మేధావులు, ఉపాధ్యాయులకు సన్మానం చేయడం గొప్ప వరం అన్నారు. ప్రజాసేవ పేరుతో అవినీతి చేసే అక్రమార్కులకు దూరం పెట్టాలన్నారు. గణిత అవధానిగా పేరు తెచ్చుకున్న, రాష్ట్రపతి అవార్డు గ్రహీత, గణిత శాస్త్ర రిటైర్డ్ ఉపాధ్యాయుడు 75 సంవత్సరాల వయసులో కూడా అవలీలగా గణిత శాస్త్ర విజ్ఞానం అందిస్తున్న అనంతప్ప యాదవ్ సమాజానికి అవసరమన్నారు. అలాగే మీలో ఎవరు కోటీశ్వరుడు ప్రోగ్రాంతో రాష్ట్ర స్థాయిలో గుర్తింపు తెచ్చుకున్న ప్రముఖ కార్టూనిస్టు, రిటైర్డ్ టీచర్ శేషిరెడ్డికి రాష్ట్ర ప్రభుత్వం తరపున రవీంద్రభారతిలో పురస్కారం అందజేస్తున్న సందర్భంగా ఆయన్ను అభినందించారు. కార్యక్రమంలో ఐక్యవేదిక అధ్యక్షుడు సతీష్ యాదవ్‌తో పాటు టీడీపీ రాష్ట్ర నాయకులు కొత్త గొల్లశంకర్, వెంకటేశ్వర్లు, సతీష్, యాదయ్య. శివకుమార్, మోహన్‌గౌడ్, విజేత రాములు, వెంకటేష్, నాగరాజు, రామస్వామి, శేఖర్ పాల్గొన్నారు.

సాగునీరు ఎవరిచ్చారో ప్రజలకు తెలుసు

పెద్దమందడి, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి) : మండలానికి సాగునీరు ఎవరిచ్చారో ప్రజలకు తెలుసు కాబట్టే 2023 ఎన్నికల్లో మేఘారెడ్డి భారీ మెజార్టీ ఇచ్చారని వనపర్తి మార్కెట్ యార్డు వైస్‌చైర్మన్ కొత్తకాపు రామకృష్ణారెడ్డి అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడారు. బీఆర్‌ఎస్ నాయకులు ప్రెస్‌మీట్ పెట్టి అన్నీ అబద్ధాలే చెప్పారని విమర్శించారు. గ్రామాల్లో తాగునీటి సమస్య ఉందని అంటున్నారు. ఎక్కడ ఉందో చూపించాలని ప్రశ్నించారు. ఎమ్మెల్యే మేఘారెడ్డి గెలిచిన తరువాత సొంత డబ్బులతో ప్రతీ గ్రామంలో బోరు బావులను వేయించారని, అవి మీకు కనిపించడం లేదా అని ప్రశ్నించారు. మండల పరిధిలోని ప్రతీ గ్రామానికి సాగునీరు అందేలా ఎమ్మెల్యే కృషి చేస్తున్నారని, అలాంటి వ్యక్తిని విమర్శించే స్థాయి మీకు లేదన్నారు. రానున్న స్థానిక ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌కి బుద్ధి చెప్పడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారని అన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ రఘుప్రసాద్, మాజీ జెడ్పీటీసీ వెంకటస్వామి, శ్రీనివాస్‌రెడ్డి, వెంకటస్వామి, రాధాకృష్ణ, వెంకటేష్, రామచంద్రయ్యగౌడ్, తిరుపతిరెడ్డి, గట్టుయాదవ్, డి.మహేష్, బాలు, అగ్గి రాముడు తదితరులు పాల్గొన్నారు.

నిజమైన పేదలకు పథకాలు అందాలి



మునిసిపల్ కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న సీపీఎం పట్టణ కార్యదర్శి పరమేశ్వరాచారి

వనపర్తి రూరల్, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి) : నిజమైన పేదలకు సంక్షేమ పథకాలు అందేలా చూడాలని సీపీఎం టౌన్ కార్యదర్శి ముమ్మడి పరమేశ్వరాచారి అన్నారు. మంగళవారం వనపర్తి పట్టణ కేంద్రంలోని మునిసిపల్ కార్యాలయంలో మునిసిపల్ వెంకటేశ్వర్లుకు వనపర్తి పట్టణ సమస్యలపై వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రధానంగా వనపర్తిలో కొన్ని సంవత్సరాలుగా నివసించే నిరుపేదలైన కుటుంబాలకు ఇందిరమ్మ ఇల్లు రాజకీయాలకు అతీతంగా సర్వే చేసి నిజమైన నిరుపేదలకు దక్కేలా చూడాలని అన్నారు. గత ప్రభుత్వం అర్హులను సర్వే చేసి డిప్పు సిస్టం అని చెప్పి, కొందరికి మాత్రమే డబుల్ బెడ్రూం ఇవ్వడం జరిగిందని, మిగతా వారందరికీ నేటి వరకు ఏ లబ్ధి చేకూరలేదని అన్నారు. కార్యక్రమంలో సీపీఎం పట్టణ కమిటీ సభ్యుడు బాలస్వామి, గంధం గట్టయ్య, బీసన్న, సీనియర్ నాయకులు సుక్క పెంటన్న, ఐద్వా సంఘం అధ్యక్షురాలు సాయిలీల పాల్గొన్నారు.

గడ్డివాము దగ్ధం



మంటలను ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

గోపాల్‌పేట, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి) : మండలం కేంద్రంలో పశుగ్రాసం కాలి బూడిదయ్యిందని బాధితుడు వాపోయాడు. మండల కేంద్రానికి చెందిన గోకారం నర్సింహ 12 గేదెలను పెంచుకుంటూ గ్రామంలో పాల వ్యాపారం చేస్తున్నాడు. పశువుల కోసం ఆరు ట్రాక్టర్ల గడ్డి తన ఇంటికి సమీపంలో వాము ఏర్పాటు చేసుకున్నాడు. మంగళవారం ఉదయం ఎవరో గుర్తు తెలియని వ్యక్తులు గడ్డివాముకు నిప్పుపెట్టారు. చుట్టు పక్కల వారు యువకులు గమనించి మంటలను ఆర్పినా.. అదుపులోకి రాలేదు. స్థానికులు ఫైర్ స్టేషన్‌కు సమాచారం అందించారు. ఫైర్ సిబ్బంది అక్కడి చేరుకొని మంటలను ఆర్పేశారు. మూ ట్రాక్టర్ల గడ్డి పూర్తిగా కాలిపోయిందని, దాంతో రూ.75 వేలు నష్టం వాటిల్లిందని బాధితుడు వాపోయాడు. ప్రభుత్వం పరంగా తమను ఆదుకోవాలని బాధితుడు కోరారు.